# రంకెలు వేస్తే అంకెలు మారవ్



**బీఆర్ఎస్ చేసిన అప్పు రూ.8,21,651 కోట్లని కట్టుకథ**

- మేం అప్పుల విషయంలో క్లిస్టర్ క్లియర్‌గా ఉన్నం
- బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు 4.17లక్షల కోట్లే
- మాది ఎక్కడైనా ఒక్కటే మాట,
- పెట్టండి అసెంబ్లీ మాట్లాడుదాం
- భట్టి నిగ్గు తేల్చిన మాజీ మంత్రి హరీశ్‌రావు

02


విశాల భారతి

05-07-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 181


# మబ్బులు తప్ప వానలు కురవవే

- వరుసగా రెండో ఏడాది.. జూన్‌లో వానల కొరత
- మేడ్చల్‌లో భారీ లోటు.. రంగారెడ్డిలో సాధారణం కంటే ప్లస్
- కాంక్రీట్ కట్టడాల వల్ల నీరు ఇంకడం లేదు
- ఉష్ణోగ్రతలు భారీగా తగ్గి కరెంట్ డిమాండ్ పడిపోయింది
- గాలులకు మేఘాలు చెదురుతున్నా.. నగరంలో మోస్తరు వానలు
- పసిఫిక్ సముద్రంలో ఎల్‌నినో సెప్టెంబర్‌లో మరింత బలపడనుంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ మహానగర పరిధిలో వరుసగా రెండో ఏడాది కూడా జూన్ మాసంలో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆకాశం మేఘావృతమై అంధకారం అలుముకుంటున్నా, బలమైన గాలుల కారణంగా మేఘాలు చెల్లాచెదురవుతున్నాయి. చిరుజల్లులు, తుంపర్లతోనే వాతావరణం సరిపెట్టుకుంటోంది. నగర పరిసరాల్లోని ప్రధాన చెరువులు, కుంటలు నిండితేనే భూగర్భ జలాలు పెరుగుతాయని ఆశించిన నగరవాసులకు నిరాశే మిగులుతోంది. గత ఏడాది మే మాసంలో కొన్ని వర్షాలు పడినా, జూన్‌లో మాత్రం తీవ్రమైన పొడి వాతావరణం ఏర్పడింది. ఈ ఏడాది జూన్‌లో హైదరాబాద్ జిల్లాలో 17 శాతం మేర లోటు వర్షపాతం రికార్డైంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అత్యధికంగా 46 శాతం వర్షపాత లోటు నమోదైంది. మిగతా 3లో..





# తెలంగాణ దివాలా తీస్తుంది

- అప్పుల వల్ల పాకిస్థాన్, శ్రీలంకలా మారే ప్రమాదం
- రాష్ట్రాన్ని రూ. 10 లక్షల కోట్ల ఊబిలోకి నెట్టారు
- ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ నిధులే
- పంచాయతీల పైసలు జీతాల కోసం వాడుకుంటున్నారు
- పేదల ఉపాధి పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం కోర్టులకు
- ఆర్థిక క్రమశిక్షణ రావాలంటే కమలం పాలన కావాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక నిర్వహణపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన విమర్శలు ప్రస్తుతం రాజకీయ వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో పాలించిన భారత్ రాష్ట్ర సమితి, ప్రస్తుతం మిగతా 2లో..

# ఒంటరైన అన్నదాత..!

తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. నిన్నమొన్నటి వరకు గ్రామాల్లోని ధాన్యం కల్లాలు, ఐకేపీ కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరిగిన ప్రతిపక్షాల నేతలు ఇప్పుడు రూట్ మార్చారు. రబీ సీజన్ ముగిసి ఖరీఫ్ ప్రారంభమైన వేళ అన్నదాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గాలికొదిలేశారు. నైరుతి రుతుపవనాలు ప్రవేశించి నెల రోజులు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు.

**కరవు ముప్పున్నా, రైతుల గోసను పార్టీలు పట్టించుకోవడం లేదు**

- సమస్యలు వదిలేసి, రూ.6.71 లక్షల కోట్ల అప్పులపైనే కాంగ్రెస్-బీఆర్ఎస్ పోరు
- పంటల ఇబ్బందులు పక్కనబెట్టి, కేవలం టెండర్ల అవకతవకలపైనే ఫోకస్
- నారుమళ్లను వదిలేసి, కేవలం గ్రేటర్ ఎన్నికలు, సిటీ ఓటర్ల పైనే దృష్టి
- 'జీ-రామ్-జీ' కొత్త చట్టంతో నష్టపోతున్నా లెఫ్ట్ పార్టీలు సైలెంట్.
- రుణమాఫీ పెండింగ్; ఉచిత పథకాల వల్ల వ్యవసాయ నిధులకు కోత



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఎల్ నినో ప్రభావంతో కరవు ఛాయలు కనిపిస్తున్నాయని వాతావరణ శాఖ 40 శాతం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇటువంటి క్లిష్ట సమయంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను అందించడంలో పాలక పక్షం విఫలమైంది. మరోవైపు అండగా ఉంటామంటూ క్షేత్రస్థాయిలో యాత్రలు చేసిన బీఆర్ఎస్, బీజేపీలు సైతం రైతుల గోసను పట్టించుకోవడం మానేశాయి. కష్టకాలంలో అన్నదాతలను ఆదుకోవాల్సిన రాజకీయ శ్రేణులు తమ స్వంత ఎజెండాలకే ప్రాధాన్యత ఇస్తూ పల్లెలను విస్మరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో పాలకుల, ప్రతిపక్షాల చర్చలన్నీ కేవలం మిగతా 3లో..

# కేసీఆర్‌ను ఉరి తీసినా తక్కువే



- పరిపాలన దొరలకే కాదు పల్లె బిడ్డలకూ సాధ్యమన్నారు
- ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చామన్నారు
- రాష్ట్రాన్ని రూ. 8,21,000 కోట్ల అప్పుల పాలు చేసింది
- కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం 'కూలేశ్వరం'గా మార్చారు
- కేసీఆర్ కుటుంబానికి వేల ఎకరాల ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి
- అహంకార శక్తులను ప్రజలు ఓటుతో బంధించారని చెప్పారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజా యుద్ధనౌక గద్దర్‌ను గత పాలకులు ఎర్రటి ఎండలో నాలుగు గంటలపాటు కూర్చోబెట్టి అవమానించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అహంభావంతో వ్యవహరించిన వారికి ఉరిశిక్ష వేసినా తక్కువేనని వ్యాఖ్యానించారు. నల్లమల్ల అడవుల నుంచి వచ్చిన తనకు పాలన చేతకాదంటూ గతంలో కొందరు అవహేళన చేశారని గుర్తుచేశారు. ఒక సామాన్య రైతు బిడ్డగా వ్యవసాయం, భూమి కష్టం తనకు పూర్తిగా తెలుసన్నారు. పరిపాలన అనేది కేవలం గడీల్లో ఉండే దొరలకు మాత్రమే పరిమితం కాదని, గ్రామాల్లో నివసించే ప్రజల కష్టసుఖాలు తెలిసిన వారికే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పాలమూరు ప్రజలు కేవలం కష్టపడే పనులకే పరిమితం కావాలా, వారికి రాష్ట్ర పాలన చేసే అర్హత లేదా అంటూ ఘాటుగా ప్రశ్నించారు. శ్రామికులుగా గుర్తింపు పొందిన పాలమూరు బిడ్డలు ఉన్నత స్థానాల్లోకి రాకుండా అడ్డుకునే దురహంకార శక్తుల ఆలోచనలను ప్రజలు బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేరుస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని మిగతా 2లో..



# అడ్లూరి వర్సెస్ కొప్పుల

- మంత్రి అడ్లూరి, కొప్పుల ఈశ్వర్ మధ్య.. మాటల యుద్ధం
- రూ. 45 కోట్ల గురుకుల టెండర్లలో.. రూ. 12 కోట్ల అవినీతి
- అవినీతి నిరూపిస్తే.. రాజీనామాకు సిద్ధమన్న అడ్లూరి!
- అడ్లూరివి నాటకాలంటూ.. ఇందిరమ్మ ఇళ్లపై శ్వేతపత్రం డిమాండ్
- గతంలో కొప్పులదే హవా.. 2023లో అడ్లూరి భారీ విజయం
- నిధుల నిలిపివేతపై.. క్షేత్రస్థాయిలో, సోషల్ మీడియాలో ఘర్షణ

02

# 20 వేల పోలీస్ కొలువులు ఏమాయె?



- కేవలం 5,000 పోస్టులు, దిల్‌సుఖ్‌నగర్‌లో భారీ రాస్తారోకో
- 33 జిల్లాలకు విభజిస్తే.. జిల్లాకు 10 పోస్టులే
- 20 వేల పోస్టులన్న రేవంత్ పాత వీడియోల ప్రదర్శన
- పురుగుల మందు తాగినా పెంచననడంపై పీఎస్‌లో ఫిర్యాదుకు యత్నం
- లక్షల రూపాయల కోచింగ్ ఖర్చులు, 7 లక్షల మందికి నిరాశ!
- 20 వేలకు పెంచకుంటే.. అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరిక

03

# విద్య పేరుతో దోపిడీ సామ్రాజ్యం..!

- నిబంధనలను పాతరేసి పిల్లల భవిష్యత్తుతో చెలగాటం చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లు..!
- నిబంధనలు 'రైజ్' అవ్వవు.., ఫీజులు మాత్రం 'సన్' లా మండుతాయ్
- చిన్నగూడూరు 'రైజింగ్ సన్ టాలెంట్ స్కూల్'లో ఇష్టారాజ్యం
- రేకుల షెడ్లలోనే నర్సరీ నుండి 5వ తరగతి వరకు బోధన

06





# 'TRS' పేరు కుదరదు!

- కవిత పెట్టిన టీఆర్ఎస్' పేరు మార్చాల్సిందే
- పాత టీఆర్ఎస్ పేరుతో ఓటర్లలో గందరగోళం
- పేరుపై 700 వరకు అభ్యంతరాలు
- బీఆర్ఎస్ అడ్డు, టీఆర్ఎస్ మా భావోద్వేగం
- మహారాష్ట్ర సంస్థ, రాజ్యసమితి సైతం నో
- 15 రోజుల్లోగా మార్చకుంటే రిజెక్ట్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తూ.. సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించిన కల్వకుంట్ల కవిత ఆశలపై కేంద్ర ఎన్నికల సంఘం గట్టి దెబ్బే కొట్టింది. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) స్థాపనతో ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్తున్న ఆమెకు అనూహ్య పరిణామం ఎదురైంది. పార్టీ సంక్షిప్త నామం పాత పార్టీని పోలి ఉండటంతో.. నిబంధనల ప్రకారం ఆ పేరును మార్చుకోవాల్సిందేనని స్పష్టం చేస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ అధికారికంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ స్థాపించిన నాటి తెలంగాణ రాష్ట్ర సమితి సైతం టీఆర్ఎస్ మిగతా 3లో..

# 'కేసీఆర్‌ను ఉరి తీసినా తక్కువే'



**మొదటి పేజీ తరువాయి**

వేగవంతం చేశామని, పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ప్రజా పాలనలో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి గణాంకాలే నిదర్శనమన్నారు. ఇప్పటివరకు రూ. 21,000 కోట్ల మేర వ్యవసాయ రుణమాఫీని ఏకకాలంలో పూర్తి చేశామని గుర్తుచేశారు. రైతు భరోసా కింద రూ. 36,000 కోట్లు కేటాయించామని, ఉచిత విద్యుత్ సరఫరా నిమిత్తం మరో రూ. 30,000 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. మొత్తంగా చూస్తే రైతు సంక్షేమ కార్యక్రమాల కోసం కేవలం ఒకే ఏడాదిలో రూ. 1,76,000 కోట్లు వెచ్చించామని లెక్కలతో సహా వెల్లడించారు. రాష్ట్ర బడ్జెట్, ఖర్చుల విషయంలో గత ప్రభుత్వ వైఫల్యాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. తమ ప్రభుత్వం నెల సగటున రూ. 5,600 కోట్లు ప్రజా సంక్షేమ పథకాల కోసం ఖర్చు పెడుతోందని వెల్లడించారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టిందో శ్వేతపత్రం ద్వారా తేల్చాలని సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు కేవలం రూ. 70,000 కోట్ల అప్పు మాత్రమే ఉండేదని, అప్పట్లో రూ. 16,000 కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పగిస్తే, గత పాలకులు దానిని అడ్డగోలుగా పెంచేశారని మండిపడ్డారు. పదేళ్ల కాలంలో రాష్ట్ర అప్పులను ఏకంగా రూ. 8,21,000 కోట్లకు చేర్చారని ఆరోపించారు. ఒకవేళ గత ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసి ఉంటే, ఏడాదికి రెండు లక్షల చొప్పున పదేళ్లలో 20 లక్షల డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించే అవకాశం ఉండేదన్నారు. అర్హులైన పేద ప్రజలకు గూడు కల్పించడంలో గత పాలకులు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. గత ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలైన డబుల్ బెడ్రూం ఇండ్లు, దళితులకు మూడు ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం వంటివన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని ముఖ్యమంత్రి ఆరోపించారు. కోటి ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పి ప్రగల్భాలు పలికారని, చివరకు కాళేశ్వరం ప్రాజెక్టును కూల్చేసి 'కూలేశ్వరం'గా మార్చారని ఎద్దేవా చేశారు. దాదాపు లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని గోదావరి పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పరిపాలన కేవలం వారి కుటుంబ ప్రయోజనాల కోసమే సాగిందని ధ్వజమెత్తారు. ఇప్పుడు పదవులు కోల్పోయిన కేసీఆర్ కుమారుడు, అల్లుడు గద్దల మాదిరిగా గ్రామ గ్రామాన తిరుగుతున్నారని విమర్శించారు. గతంలో ప్రజలను పీడించిన 'పాపాల భైరవుడు' మళ్లీ అధికారంలోకి రావాలంటూ కొందరు గుండెలు బాదుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అటువంటి అరాచక శక్తులు తిరిగి రాకుండా ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాగుతున్న ప్రజా పరిపాలనను ఎందుకు అంతమొందించాలో ప్రజలే ఆలోచించాలని ముఖ్యమంత్రి కోరారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, మరణాలు, చివరకు గ్రామాల్లోని కల్లు దుకాణాలు, బార్ షాపుల వద్ద కూడా దీనిపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. ప్రజా ప్రభుత్వం ఎందుకు పోవాలి, ఫామ్‌హౌస్‌కే పరిమితమైన గత పాలకులు ఎందుకు మళ్లీ రావాలి అనే విషయాలపై ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆశీస్సులు, ఆకాంక్షల మేరకు ఏర్పడిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిని అంతమొందించిందన్నారు. గత పాలకుల హయాంలో జరిగిన దోపిడీలు, దొంగతనాలు పూర్తిగా ఆగిపోయాయని స్పష్టం చేశారు. ఒకప్పుడు సాధారణంగా ఉన్న నాయకులకు వేల ఎకరాల ఆస్తులు, ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలు గమనించాలని సూచించారు. గత పాలకుల కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భారీ ఆస్తుల వివరాలను ముఖ్యమంత్రి బహిరంగంగా ప్రస్తావించారు. మాజీ సీఎం కేసీఆర్ కు వేల ఎకరాల ఫామ్‌హౌజ్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. జన్వాడలో ఆయన కుమారుడికి వంద ఎకరాల ఫామ్‌హౌజ్, మొయినాబాద్‌లో అల్లుడికి 50 ఎకరాల ఫామ్‌హౌజ్ ఏ విధంగా సమకూరాయో చెప్పాలన్నారు. శంకర్‌పల్లి పరిధిలో కవితకు 25 ఎకరాల ఫామ్‌హౌజ్ ఉందని, ఈ అపారమైన ఆస్తులన్నీ ఎక్కడ సంపాదించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలను, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఈ సంపదనంతా కూడబెట్టారని ఆరోపించారు. వారి దుర్మార్గపు పాలన వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, ఉపాధి దొరకక యువత అల్లాడిపోయారని, అప్పుల బాధతో అనేకమంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారని గుర్తుచేశారు.

తెలంగాణ మహిళలు ఎంతో పవిత్రంగా భావించే బతుకమ్మ పండుగను కూడా గత పాలకులు వ్యాపారంగా మార్చేశారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బతుకమ్మ చీరల పంపిణీ పేరిట భారీగా కమిషన్లు దండుకున్నారని, దోపిడీ కోసం చీరలను సైతం వదల్లేదని దుయ్యబట్టారు. అటువంటి దుర్మార్గులు, నీచులు మళ్లీ అధికారం కోసం ఆరాటపడుతున్నారని విమర్శించారు. ప్రజల నెత్తిన రూ. 8,21,000 కోట్ల అప్పుల భారాన్ని మోపి, వారు మాత్రం లక్షల కోట్ల రూపాయలు ఎలా సంపాదించారో గ్రామీణ ప్రజలు మేల్కొని ఆలోచించాలన్నారు. 'అరుంధతి' చలనచిత్రంలో విలన్ పశుపతిని పాడుబడిన బంగ్లాలో బంధించినట్లుగా, తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలు గత పాలకులను ఓటు హక్కు ద్వారా గొలుసులతో బంధించారని వ్యాఖ్యానించారు. అహంకార శక్తులకు రాష్ట్రంలో భవిష్యత్తు లేదని, వారి రాజకీయ అధ్యాయానికి ప్రజలు ఎప్పుడో ముగింపు పలికారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణ దివాలా తీస్తుంది

**మొదటి పేజీ తరువాయి**

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకే తరహా ఆర్థిక విధానాలను అనుసరిస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయని ఆయన ఆరోపించారు. వేములవాడ వేదికగా జరిగిన అధికారిక కార్యక్రమాల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, రెండు ప్రభుత్వాల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని లూటీ చేస్తూ, విచ్చలవిడిగా అప్పులు చేస్తూ రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని ధ్వజమెత్తారు. పాలకుల బాధ్యతారాహిత్యం వల్ల తెలంగాణ సమాజంపై మోయలేని భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహా విధానాల వల్ల రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్ర అప్పుల భారం ఏకంగా 10 లక్షల కోట్ల రూపాయలకు చేరిందని, దీనివల్ల ప్రతి సామాన్య పౌరుడిపై భారీగా భారం పడుతోందని బండి సంజయ్ గణాంకాలతో సహా వివరించారు. ఉత్పత్తి లేని రంగాలపై పెట్టుబడులు పెట్టడం, ఉత్పాదకత లేని పథకాలకు నిధులు మళ్లించడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ అప్పుల సంస్కృతి, ప్రస్తుత ప్రభుత్వంలో కూడా అదే వేగంతో కొనసాగుతోందని ఆరోపించారు. ఆర్థిక క్రమశిక్షణ లోపించడం వల్లే ఆదాయ వనరులు పెరిగినప్పటికీ అప్పుల భారం తగ్గడం లేదని విమర్శించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, తాయిలాల కోసం భారీగా రుణాలు సేకరిస్తూ భవిష్యత్ తరాల ఉపాధిని, ప్రగతిని పణంగా పెడుతున్నారని దుయ్యబట్టారు. ఈ అప్పుల భారం వల్ల భవిష్యత్తులో అభివృద్ధి పనులకు నిధులు కొరవడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా ఆర్థిక బాధ్యతారాహిత్యం ఇలాగే కొనసాగితే తెలంగాణ భవిష్యత్తులో పాకిస్థాన్, శ్రీలంక వంటి దేశాల తరహాలో దివాలా తీసే ప్రమాదం ఉందని బండి సంజయ్ హెచ్చరించారు. ఆయా దేశాలు కూడా ఆదాయాన్ని మించిన వ్యయాలు, ఉత్పాదకత లేని అప్పుల వల్లనే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడిపోయాయని గుర్తుచేశారు. ఒకప్పుడు మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ, నేడు జీతాల చెల్లింపుల కోసం కూడా



అప్పులపై ఆధారపడే స్థితికి రావడం పాలకుల వైఫల్యమేనన్నారు. సంక్షోభం నుంచి గట్టెక్కి రాష్ట్రం ప్రగతిపథంలో పయనించాలంటే ఆర్థిక క్రమశిక్షణ కలిగిన భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న పారదర్శక విధానాల వల్లనే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని, రాష్ట్రంలో కూడా అటువంటి పాలన అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో జరుగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక కేంద్రంలోని మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని బండి సంజయ్ స్పష్టం చేశారు. జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వే లైన్ల విస్తరణ, గ్రామీణ మౌలిక వసతుల కల్పన వంటి అనేక రంగాలకు కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను కేటాయించిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ సొంత నిధులతో చేస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నాయని, క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరేలా ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర నిధుల వినియోగంలో పారదర్శకత లేకపోవడం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రగతికి కేంద్రం పూర్తి స్థాయిలో సహకరిస్తున్నప్పటికీ, ఇక్కడి పాలకులు రాజకీయ లబ్ధి కోసం కేంద్రంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నిధుల కేటాయింపులపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. గ్రామ పంచాయతీల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి కేంద్ర ప్రభుత్వం నేరుగా పంపుతున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి పాలకులు దారిమళ్లిస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. పల్లెల్లో మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం మెరుగుపరచడానికి ఉద్దేశించిన ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత అవసరాల కోసం, ఉద్యోగుల జీతాల చెల్లింపుల కోసం వాడుకుంటోందని దుయ్యబట్టారు. దీనివల్ల గ్రామాల్లో సర్పంచ్‌లు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నారని, పంచాయతీలు ఉత్సవ విగ్రహాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ఇచ్చిన నిధులను ఏయే రంగాలకు ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తూ, వాటికి రావాల్సిన రాజ్యాంగబద్ధమైన నిధులను మళ్లించడం ముమ్మాటికీ ప్రజాస్వామ్య ద్రోహమేనని ఆయన తీవ్రంగా పరిగణించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నో ప్రజాహిత పథకాలపై రాష్ట్ర పాలకులు కోర్టులకు వెళ్లడంపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి, శాశ్వత సంపదను సృష్టిస్తుంటే, దానిపై కూడా రాజకీయం చేయడం దారుణమన్నారు. పేదలకు, నిరుద్యోగులకు మేలు చేసే ఇటువంటి పథకాలను అడ్డుకోవాలని చూడడం పాలకుల కుంచిత మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు. కేంద్ర పథకాల వల్ల పేద ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతుండడంతో, తమ రాజకీయ ఉనికి దెబ్బతింటుందనే భయంతోనే ప్రతిపక్షాలు ఈ విధమైన చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. అభివృద్ధిని అడ్డుకుంటూ, ప్రజల పొట్టగొట్టే విధంగా వ్యవహరించే ప్రభుత్వాలకు రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతున్న ఆదరణను, ప్రజామద్దతును తట్టుకోలేకనే ఇక్కడి ప్రతిపక్షాలు ఈర్ష్యతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని బండి సంజయ్ విమర్శించారు. కేంద్రంపై అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని, అయితే ప్రజలు అన్ని విషయాలను నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. పాలకుల వైఫల్యాలను, అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే కేంద్రంపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

# రంకెలు వేస్తే అంకెలు మారవ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్ర అప్పుల లెక్కలపై కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ యుద్ధం ముదిరింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నిన్నటి విలేకరుల సమావేశంలో ప్రకటించిన అప్పుల వివరాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. భట్టి విక్రమార్క చెప్పినవన్నీ అబద్ధాలు, అర్ధసత్యాలని, రాష్ట్రాన్ని అప్రతిష్ట పాలు చేసేలా మసిబూసి మారేడు కాయ చేసే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన అత్యవసర మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే అధికార పార్టీ తప్పుడు లెక్కలను వండివారుస్తోందని ఆరోపించారు. రంకెలు వేసినంత మాత్రాన అధికారిక అంకెలు మారవని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన వాస్తవిక అప్పు 4.17 లక్షల కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ వేదికగా తాము గతంలో సమర్పించిన ఈ అధికారిక గణాంకాలకే ఇప్పటికీ, ఎప్పటికీ కట్టుబడి ఉంటామని తేల్చిచెప్పారు. రాష్ట్ర ఆర్థిక మంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క లాంటి సీనియర్ నాయకుడికి అప్పుల అసలు వాస్తవాలు తెలియవని తాను అనుకోవడం లేదన్నారు. అన్ని విషయాలు తెలిసి కూడా కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడానికే గోబెల్స్ ప్రచారానికి తెరలేపారని విమర్శించారు. గతంలో మంత్రి జూపల్లి కృష్ణారావు అప్పులపై సవాళ్లు విసిరి, ఆ తర్వాత తోక ముడిచిన తీరును యావత్ సమాజం గమనించిందన్నారు. ఆ పరాభవం నుంచి బయటపడటానికి, ఆత్మరక్షణలో భాగంగానే ఆర్థిక మంత్రి ఈరోజు అడ్డగోలు లెక్కలతో పక్కదారి పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. అప్పుల అంశంలో బీఆర్ఎస్ పార్టీ స్పష్టమైన నిబద్ధతతో ఉందన్నారు. కాంగ్రెస్ నాయకుల తరహాలో పూటకో మాట, సభకో లెక్క చెప్పే అలవాటు తమకు లేదన్నారు. అసెంబ్లీలో, బహిరంగ సభల్లో, ప్రెస్ మీట్లలో తాము ఒకే మాటకు కట్టుబడి ఉంటామని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సహా మంత్రిమండలి మొత్తానికి ఆధారాలతో సహా సవాల్ విసురుతున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి ఆదాయాలు సమకూర్చుకోవడంలో అపారమైన అనుభవం ఉందని, అప్పులు పెద్ద సమస్యే కాదని గతంలో భట్టి చెప్పిన వ్యాఖ్యలను హరీశ్‌రావు ప్రస్తావించారు. ఆ అపారమైన అనుభవం ఇప్పుడు ఏమైందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను, హామీలను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక, అప్పుల నెపం నెడుతూ కుంటి సాకులు వెతుకుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో కరోనా సంక్షోభం వచ్చి ఆర్థిక వ్యవస్థ కుదేలైనా, కేంద్రం పెద్ద నోట్లు రద్దు చేసినా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నడూ రాష్ట్రం దివాళా తీసిందని మాట్లాడలేదన్నారు. ధైర్యంగా నిలబడి పరిపాలన సాగించారని గుర్తుచేశారు. ఇప్పుడు అలాంటి విపత్కర పరిస్థితులు ఏవీ లేకపోయినా రేవంత్‌రెడ్డి పదేపదే రాష్ట్రం దివాళా తీసిందంటూ దిగజారి మాట్లాడుతున్నారని ఆరోపించారు. తమను ఎవరూ నమ్మడం లేదని, అప్పు పుట్టడం లేదని ఢిల్లీలో అపాయింట్‌మెంట్లు దొరకడం లేదని ముఖ్యమంత్రే స్వయంగా అనడం వారి చేతకానితనానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ మార్కు రెండున్నరేళ్ల పాలనలోనే వారి దక్షత ఏపాటిదో అర్థమైపోయిందని దుయ్యబట్టారు. అధికార పార్టీ చెబుతున్న అప్పుల లెక్కల్లో ఏమాత్రం స్థిరత్వం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో బీఆర్ఎస్ చేసిన అప్పు 6,71,757 కోట్లుగా చూపిందని, అందులోనూ తమకు సంబంధం లేని అంశాలను కలిపారని విమర్శించారు. నిన్న భట్టి విక్రమార్క మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు 8,21,651 కోట్లు అని కట్టుకథలు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం అధికారికంగా సమర్పించిన కాగ్ నివేదిక, 2023 డిసెంబరు నాటి శ్వేతపత్రం, బడ్జెట్ పత్రాలు, ఎకనామిక్ సర్వే నివేదికల ప్రకారం చూసినా బీఆర్ఎస్ హయాం నాటి అప్పు 4.17 లక్షల కోట్లు దాటలేదన్నారు. తాను అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి, భట్టి సమక్షంలోనే ఈ లెక్కలు నిరూపించానని, దీనిపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ నాటకాలు ఆడుతోందన్నారు. 2026 మార్చి 18న అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 28, 2026 నాటికి రాష్ట్ర మొత్తం అప్పు 3,47,294 కోట్లు అని ప్రకటించారని, మరి నిన్న భట్టి 3,85,600 కోట్లు అని చెప్పడం గారడీ కాదా అని ప్రశ్నించారు. జూన్ 30 నాటికి పబ్లిక్ డొమైన్‌లో ఉన్న అధికారిక సమాచారం ప్రకారం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ 31 నెలల కాలంలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏకంగా 4,50,000 కోట్ల భారీ అప్పులు చేసిందని హరీశ్‌రావు బాంబు పేల్చారు. ఒకవైపు బీఆర్ఎస్ అప్పులు చేసిందని తప్పుడు ప్రచారం చేస్తూ, మరోవైపు దొంగదారిన వేల కోట్ల రూపాయలను కమీషన్లుగా ఇస్తూ అప్పులు తెస్తున్నారని ఆరోపించారు. తాము అసెంబ్లీలో అడిగిన ప్రశ్నలతోనే ఈ అప్పుల బండారం బయటపడిందన్నారు. ఎఫ్ఆర్బీఎం పరిధి దాటి అప్పులు సేకరించడం కోసం బ్రోకర్లకు వందల కోట్ల రూపాయల లంచాలు ఇస్తున్నారని ఆరోపించారు. దేశ చరిత్రలోనే ఇలాంటి దిక్కుమాలిన పరిపాలన ఎక్కడా జరగలేదన్నారు. టీజీఐఐసీ భూములను కుదువపెట్టి 10,000 కోట్ల అప్పు తేవడానికి ఏకంగా 170 కోట్ల రూపాయల బ్రోకరేజీ ఛార్జీలు చెల్లించారని నిలదీశారు. హెచ్ఎండీఏ భూముల ద్వారా మరో 20,000 కోట్ల అప్పు కోసం ప్రయత్నిస్తున్నారని, మొత్తంగా 30,000 కోట్ల అప్పునకు బ్రోకర్లకు ముడుతున్న సొమ్ము 510 కోట్ల రూపాయలని లెక్కలు వివరించారు. మూడు హైదరాబాద్ కార్పొరేషన్లు, డిస్కంలు, జలమండలి ద్వారా మరో 70,000 కోట్ల అప్పు తేవాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని హరీశ్‌రావు వెల్లడించారు.

# అడ్లూరి వర్సెస్ కొప్పుల

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో జగిత్యాల జిల్లా పరిధిలోని ధర్మపురి ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం ఒక్కసారిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ప్రస్తుత సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మధ్య సాగుతున్న తీవ్ర స్థాయి రాజకీయ పోరు సరికొత్త మలుపులు తిరుగుతోంది. సుదీర్ఘ కాలంగా ఇక్కడి రాజకీయాల్లో ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న ఇరు పార్టీల సీనియర్ నేతలు ఇప్పుడు వ్యక్తిగత విమర్శల స్థాయికి దిగజారడం స్థానిక ఓటర్లలో తీవ్ర ఉత్కంఠ కలిగిస్తోంది. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఈ ఇద్దరు నాయకులు సవాళ్లు విసురుకుంటూ 2023 అసెంబ్లీ ఎన్నికల నాటి పోరును మళ్లీ గుర్తుకు తెస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 2,20,000 మంది ఓటర్ల సాక్షిగా సాగుతున్న ఈ వాగ్యుద్ధం రాబోయే రోజుల్లో ఎలాంటి రాజకీయ సమీకరణాలకు దారితీస్తుందోనన్న ఆందోళన కార్యకర్తల్లో స్పష్టంగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న 145 గ్రామాల్లోని కేడర్ మొత్తం ఈ ప్రచ్ఛన్న యుద్ధం వల్ల నిత్యం రోడ్లపైకి వస్తూ ఘర్షణ వాతావరణాన్ని తలపింపజేస్తోంది. ప్రధానంగా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని దాదాపు 45 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ గురుకుల పాఠశాలల టెండర్ల ప్రక్రియ ఈ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. గత కాంగ్రెస్ ఐదు దశాబ్దాల పాలనను, పదేళ్ల బీఆర్ఎస్ హయాం నాటి నిధులను పోల్చుతూ ఇరుపక్షాలు లెక్కలు బయట పెడుతున్నాయి. గతంలో ఇదే శాఖను ఐదేళ్ల పాటు విజయవంతంగా నిర్వహించిన కొప్పుల ఈశ్వర్ ప్రస్తుత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై సుమారు 12 కోట్ల రూపాయల మేర టెండర్ల అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ టెండర్ల వ్యవహారానికి సంబంధించిన 18 పేజీల కీలక ఆధారాలు, డిజిటల్ రికార్డులు తన వద్ద సిద్ధంగా ఉన్నాయని బహిరంగంగా ప్రకటించారు. వీటితో పాటు ధర్మపురి అసెంబ్లీ స్థానం పరిధిలోని గోదావరి నది తీర ప్రాంతం నుంచి రోజుకు 300 ఇసుక లారీల అక్రమ రవాణా సాగుతోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. దాదాపు 18,000 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఐదు శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారంటూ





లెక్కలతో సహా ఆరోపణలు గుప్పించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రంలో 3 లక్షల కోట్ల రూపాయల అప్పులు అయ్యాయని, స్థానిక నియోజకవర్గంలో రూ.50 కోట్ల విలువైన సివిల్ కాంట్రాక్టులు కొప్పుల అనుచరులకే దక్కాయని కౌంటర్ ఇచ్చారు. గతంలో నిరుపేదలకు పంపిణీ చేసే రేషన్ సరుకులు, పప్పులు బ్లాక్ మార్కెట్లో అమ్ముకున్న చరిత్ర కొప్పుల ఈశ్వర్‌కు ఉందని తీవ్ర విమర్శలు సంధించారు. ప్రస్తుతం సవాల్ చేస్తున్న టెండర్ల ఫైళ్లపై హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్ వేదికగా తనిఖీలకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి అవినీతి జరిగినట్లు నిరూపించినా తన 15 ఏళ్ల రాజకీయ జీవితానికి స్వస్తి పలుకుతానని చెప్పారు. తక్షణమే తన శాసనసభ సభ్యత్వానికి, మంత్రి పదవికి రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు సమర్పించడానికి ఏమాత్రం వెనుకాడబోనని ధర్మపురి పట్టణంలో జరిగిన 3,000 మంది కార్యకర్తల సమావేశంలో మంత్రి ప్రకటించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విసిరిన రాజీనామా సవాల్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెటకారంగా స్పందించడం గమనార్హం. తెలంగాణ రాజకీయాల్లో 35 ఏళ్ల అనుభవం ఉన్న తనకు ఇలాంటి సవాళ్లు కొత్త కాదని ఈశ్వర్ పేర్కొన్నారు. అసెంబ్లీ రికార్డుల ప్రకారం గతంలో తాము ఎన్నోసార్లు నైతిక విలువల కోసం రాజీనామాలు చేశామని గుర్తు చేశారు. మంత్రి పదవిని వదులుకోవడం అనేది 24 గంటల్లో జరిగే ప్రక్రియ కాదని, కేవలం ప్రజల సానుభూతి కోసమే అడ్లూరి ఈ నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని 6 మండలాల్లో నిలిచిపోయిన 4,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రూ.150 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనుల టెండర్లను రద్దు చేయడం వెనుక ఉన్న మతలబు ఏమిటో 48 గంటల్లోగా ప్రజల ముందు ఉంచాలన్నారు. రాజీనామాల ముచ్చట పక్కన పెట్టి వాస్తవాలను కోర్టు పరిధిలోకి తీసుకురావడానికి సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం 2009 సంవత్సరంలో పునర్విభజనలో భాగంగా ఏర్పడినప్పటి నుండి ఈ ఇద్దరు నాయకుల మధ్యే ప్రధాన పోటీ సాగుతోంది. గడిచిన 15 ఏళ్లలో జరిగిన నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో 2009, 2014, 2018 లలో వరుసగా కొప్పుల ఈశ్వర్ బీఆర్ఎస్ తరపున స్వల్ప ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ముఖ్యంగా 2018 ఎన్నికల్లో కేవలం 441 ఓట్ల అతి తక్కువ తేడాతో అడ్లూరి లక్ష్మణ్‌పై ఈశ్వర్ గెలుపొందడం అప్పట్లో హైకోర్టు వరకు వెళ్లింది. అయితే 2023 డిసెంబర్ ఎన్నికల్లో సీన్ పూర్తిగా రివర్స్ అయింది. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ 22,000 పైచిలుకు భారీ ఓట్ల మెజారిటీతో కొప్పుల ఈశ్వర్‌ను మట్టికరిపించారు. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటికీ సామాజిక సమీకరణాల దృష్ట్యా లక్ష్మణ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో అత్యంత కీలకమైన సాంఘిక సంక్షేమ శాఖ దక్కింది. దీంతో నియోజకవర్గంలో తన పట్టును నూటికి నూరు శాతం పెంచుకోవాలని అడ్లూరి చూస్తున్నారు. ప్రస్తుతం ధర్మపురి నియోజకవర్గంలోని 120 కిలోమీటర్ల పొడవైన గ్రామీణ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థల ఏర్పాటుకు సంబంధించిన పనుల కేటాయింపులు తీవ్ర వివాదస్పదంగా మారాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.80 కోట్ల నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని కొప్పుల ఈశ్వర్ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన 6 గ్యారంటీల అమలులో 40 శాతం కూడా పురోగతి లేదని విమర్శిస్తున్నారు. ఇటు కాంగ్రెస్ శ్రేణులు సైతం బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ 2 పనుల వైఫల్యాలను ఎత్తి చూపుతున్నారు. నియోజకవర్గంలో గల 32,000 మంది రైతులకు రుణమాఫీ నిధులు అందకుండా గత ప్రభుత్వ అధికారులే అడ్డంకులు సృష్టించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా ఇరు పక్షాలు ప్రతి అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం వల్ల నియోజకవర్గంలో ప్రశాంతత కరువై నిత్యం టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ పొలిటికల్ ఫైట్ కాస్తా సామాజిక మాధ్యమాల్లోని ఫేస్‌బుక్, ఎక్స్ వంటి వేదికలపై దాదాపు 50,000 మంది ఫాలోవర్ల మధ్య డిజిటల్ యుద్ధంగా మారింది. ఇరు పార్టీల ఐటీ విభాగాలు పాత వీడియోలు, టెండర్ల కాపీలు, జీవో నంబర్ల స్క్రీన్ షాట్లను షేర్ చేస్తూ ట్రోలింగ్ మొదలు పెట్టాయి. రానున్న మున్సిపల్, సహకార సంఘాల ఎన్నికల్లో ఈ ప్రభావం స్పష్టంగా పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ధర్మపురి పుణ్యక్షేత్రం సాక్షిగా మొదలైన ఈ రాజకీయ ఘర్షణ రాబోయే రోజుల్లో న్యాయస్థానాల మెట్లు ఎక్కేలా కనిపిస్తోంది. అవినీతి నిరూపణ అయితే జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని ఒకరు, అసత్య ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తానని మరొకరు హెచ్చరించుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పొలిటికల్ హీట్ ముున్ముందు ఏ తీరాలకు చేరుతుందోననే ఆసక్తి రాష్ట్ర రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# క్యాన్సర్ చికిత్సలో సరికొత్త విప్లవం

**విశాలభారతి, బెంగళూరు:**

బెంగళూరులోని ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) పరిశోధకులు నోటి క్యాన్సర్ చికిత్సలో ఒక అద్భుతమైన మైలురాయిని అధిగమించారు. ఆరోగ్యకరమైన కణాలకు ఎలాంటి హాని కలిగించకుండా, కేవలం క్యాన్సర్ సోకిన కణాలను మాత్రమే ఎంపిక చేసి నాశనం చేయడానికి వారు అల్ట్రాసౌండ్ తరంగాలను విజయవంతంగా ఉపయోగించారు. సాధారణంగా కీమోథెరపీ, రేడియేషన్ వంటి సాంప్రదాయ చికిత్సల వల్ల క్యాన్సర్ కణాలతో పాటు చుట్టుపక్కల ఉండే మంచి కణాలు కూడా దెబ్బతిని రోగులు తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్‌కు గురవుతుంటారు. అయితే, ఐఐఎస్‌సీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఈ సరికొత్త పద్ధతిలో తక్కువ తీవ్రత కలిగిన అల్ట్రాసౌండ్ ఫ్రీక్వెన్సీని ప్రయోగించి, నోటిలోని క్యాన్సర్ కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని వాటిని సమర్థవంతంగా నిర్మూలించవచ్చని పరిశోధనల్లో తేలింది. క్యాన్సర్ చికిత్సను మరింత సురక్షితంగా, తక్కువ ఖర్చుతో, రోగులకు ఎలాంటి బాధ లేకుండా అందించడానికి ఈ సరికొత్త సాంకేతికత భవిష్యత్తులో ఎంతగానో దోహదపడుతుందని వైద్య నిపుణులు భావిస్తున్నారు.



# 20 వేల పోలీస్ కొలువులు ఏమాయే?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో కేవలం ఐదు వేల ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేయడంపై అభ్యర్థుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో వందలాది మంది అభ్యర్థులు శనివారం ఉదయం ఆందోళనకు దిగారు. రహదారిపై బైఠాయించి ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముప్పై లక్షల మంది నిరుద్యోగ యువత భవిష్యత్తును ఈ నోటిఫికేషన్ అంధకారంలోకి నెట్టేసిందని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో భారీగా కొలువులు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పుడు ఇంత తక్కువ సంఖ్యలో ఖాళీలు ప్రకటించడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. నిరసనకారులను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. అభ్యర్థులు మాత్రం వెనక్కి తగ్గకుండా తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఐదు వేల పోస్టులు ఏ మూలకు సరిపోతాయని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణలోని ముప్పై మూడు జిల్లాల పరిధిని పరిగణనలోకి తీసుకుంటే ఈ సంఖ్య అత్యంత అల్పమైనదని వారు విశ్లేషిస్తున్నారు. ఈ మొత్తం ఖాళీలను విభిన్న కేటగిరీలు, రిజర్వేషన్ల వారీగా విభజిస్తే ఒక్కో జిల్లాకు పట్టుమని పది పోస్టులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కొన్ని వెనుకబడిన జిల్లాల్లో ఓపెన్ కేటగిరీ పరిధిలో ఒక్క ఉద్యోగం కూడా లభించని దుస్థితి ఏర్పడుతుంది. రాష్ట్రంలో ఇరవై నాలుగు వేలకు పైగా పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గతంలో అధికారిక లెక్కలు తెలిపాయి. అటువంటిది కేవలం ఐదు వేల మందితోనే సరిపెట్టాలని చూడటం నిరుద్యోగులను వంచించడమేనని విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు. మూడేళ్లుగా కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు ఖర్చు చేస్తూ రాత్రింబగళ్లు చదువుతున్న అభ్యర్థులకు ఈ ప్రకటన తీవ్ర నిరాశను మిగిల్చింది. ప్రభుత్వం తక్షణమే ఈ సంఖ్యపై పునరాలోచన చేయాలని, ఖాళీల వివరాలను పారదర్శకంగా బయటపెట్టాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దిల్‌సుఖ్‌నగర్ ఆందోళన సందర్భంగా నిరుద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత వీడియోలను ప్రదర్శించారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి నిరుద్యోగుల పక్షాన నిలబడి మాట్లాడిన మాటలను డిజిటల్ స్క్రీన్లపై చూపించారు. నాడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఆయన హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. పోలీస్ శాఖలోనే కనీసం ఇరవై వేల పోస్టులతో మెగా నోటిఫికేషన్ ఇస్తామని నాటి రేవంత్ రెడ్డి చెప్పిన వ్యాఖ్యలను అభ్యర్థులు స్క్రీన్లపై ప్లే చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం రాజకీయ నాయకులకు అలవాటే అయినప్పటికీ ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. నాడు నిరుద్యోగుల ఓట్లతో గద్దెనెక్కి నేడు వారిని రోడ్డున పడేయడం శోచనీయమన్నారు. అభ్యర్థులు చూపించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో సైతం విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు సైతం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని తప్పుపడుతున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందని అభ్యర్థులు గట్టిగా డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల నిరుద్యోగులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. పురుగుల మందు తాగినా, బావిలో దూకినా ఐదు వేల పోస్టుల కంటే ఒక్క పోస్టు కూడా పెంచేది లేదని సీఎం వ్యాఖ్యానించినట్లు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి హేయమైన వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు న్యాయమని వారు నిలదీస్తున్నారు. తమ సొంత తల్లిదండ్రులు సైతం ఎప్పుడూ ఇంతటి కఠినమైన మాటలు అనలేదని పలువురు అభ్యర్థులు కన్నీటిపర్యంతమయ్యారు. నిరుద్యోగుల ప్రాణాలంటే ప్రభుత్వానికి అంత చులకనా అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలకు నిరసనగా చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ముఖ్యమంత్రిపై కేసు నమోదు చేసేందుకు అభ్యర్థులు ప్రయత్నించారు. పోలీసులు వారిని పోలీస్ స్టేషన్ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఫిర్యాదు స్వీకరించడానికి సైతం నిరాకరించడంతో అభ్యర్థులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించడం తగదన్నారు. సీఎం వ్యాఖ్యలు అభ్యర్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థుల సంఖ్య దాదాపు ఏడు లక్షల వరకు ఉంటుంది. గత నోటిఫికేషన్ల గణాంకాలను పరిశీలిస్తే ఒక్కో పోస్టుకు సగటున నూటయాభై మంది పోటీ పడుతున్నారు. ప్రస్తుత ఐదు వేల పోస్టుల నోటిఫికేషన్‌కు ఈ పోటీ మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ పరిమిత పోస్టుల వల్ల గ్రామీణ ప్రాంత అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారు. కోచింగ్ ఫీజులు, గదుల అద్దెలు, పుస్తకాల కోసం ఒక్కో అభ్యర్థి సగటున లక్ష రూపాయల వరకు ఖర్చు చేశారు. ప్రభుత్వం తక్కువ పోస్టులు వేయడం వల్ల ఈ పెట్టుబడి అంతా వృథా అవుతుందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే యువతను ఇలా నిర్లక్ష్యం చేయడం వల్ల సామాజిక అసంతృప్తి పెరుగుతుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. తక్షణమే నోటిఫికేషన్ సవరించి పోస్టుల సంఖ్యను ఇరవై వేలకు పెంచాలని అభ్యర్థులు కోరుతున్నారు. పెంచిన పోస్టులతో కొత్త జీవో జారీ చేసే వరకు తమ నిరసనలు ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగుల సంఘాలు ఈ ఆందోళనకు మద్దతు ప్రకటించాయి. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ వంటి నగరాల్లో సైతం నిరసన ప్రదర్శనలు జరిగాయి. నిరుద్యోగుల ఆవేదనను ప్రభుత్వం తక్కువగా అంచనా వేయవద్దని విద్యార్థి నాయకులు హెచ్చరించారు. గతంలో ఉన్న ప్రభుత్వం నిరుద్యోగ నిరసనల వల్లే పతనమైన విషయాన్ని ప్రస్తుత పాలకులు గుర్తుంచుకోవాలన్నారు. ఐదు వేల ఉద్యోగాల నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుని సమగ్రమైన క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలోని ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. హోంశాఖ పరిధిలో ఉన్న అన్ని విభాగాల ఖాళీలను ఇందులో చేర్చాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే అసెంబ్లీ ముట్టడికి సైతం వెనుకాడబోమని అభ్యర్థులు ప్రకటించారు. శాంతియుత పోరాటాన్ని అణచివేయాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరికలు పంపారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆలకించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ వర్గాల నుంచి ఈ ఆందోళనలపై భిన్నమైన స్పందన వస్తోంది. ఆర్థిక రికార్డులను బట్టి దశలవారీగా ఉద్యోగాల భర్తీ చేపడుతున్నామని పాలక పక్ష నేతలు సమర్థించుకుంటున్నారు. రాబోయే కాలంలో మరికొన్ని నోటిఫికేషన్లు వస్తాయని చెప్తున్నారు. నిరుద్యోగులు మాత్రం ఈ మాటలను నమ్మడం లేదు. ఒక్కసారి నోటిఫికేషన్ వస్తే మళ్లీ ప్రక్రియ పూర్తి కావడానికి రెండేళ్లు పడుతుందని వారు చెప్తున్నారు. అందువల్ల ఇప్పుడే పోస్టుల సంఖ్యను పెంచాలని పట్టుబడుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ అంశంపై ప్రభుత్వం మొండివైఖరి వీడాలని విపక్షాలు సైతం డిమాండ్ చేస్తున్నాయి. నిరుద్యోగులకు అండగా పోరాడుతామని వివిధ రాజకీయ పార్టీలు ప్రకటించాయి. రాష్ట్రంలో నెలకొన్న ఈ ఉత్కంఠ పూరిత వాతావరణం శాంతి భద్రతలకు విఘాతం కలిగించకముందే ప్రభుత్వం ఒక సానుకూల నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఐదు వేల పోస్టుల వివాదం ఎంతవరకు దారితీస్తుందోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అభ్యర్థుల డిమాండ్లపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది.



# 'TRS' పేరు కుదరదు!



**మొదటిపేజీ తరువాయి**

అనే గుర్తింపుతోనే సుదీర్ఘకాలం పనిచేసింది. రాష్ట్రం సిద్ధించిన అనంతరం భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మారినప్పటికీ.. పాత పేరుకున్న సెంటిమెంట్ దృష్ట్యా ఈ కొత్త పేరును ఈసీఐ ఆమోదించడం లేదు. భవిష్యత్తులో ఓటర్లు తీవ్ర గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉందన్న ప్రాథమిక అంచనాతోనే ఈసీ ఈ నిర్ణయానికి వచ్చింది. మూడు ప్రత్యామ్నాయ పేర్ల జాబితాను తక్షణమే పంపాలని కవితకు స్పష్టమైన దిశానిర్దేశం చేసింది. ఢిల్లీ కేంద్రంగా వెలువడిన ఈ ఉత్తర్వుల్లో కాలపరిమితిని సైతం అత్యంత కచ్చితంగా విధించడం గమనార్హం. కేవలం 15 రోజుల గడువు లోపల నూతన పేర్లను ప్రతిపాదించకుంటే.. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును పూర్తిగా మూసివేస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఒక రాజకీయ శక్తంగా ఆవిర్భవించాలని భావించిన కవితకు ఈ ఆదేశాలు పెద్ద ప్రతిబంధకంగా మారాయి. ఈ పేరు ప్రకటన వెలువడిన నాటి నుండి సమాజంలోని విభిన్న వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రజలు, విశ్లేషకులు, వివిధ ప్రజాసంఘాల నుండి ఏకంగా 600 నుండి 700 వరకు అభ్యంతరాలు ఫిర్యాదుల రూపంలో కేంద్ర ఎన్నికల సంఘానికి వెల్లువెత్తాయి. ఇంతటి భారీ స్థాయిలో అభ్యంతరాలు రావడం వల్లనే కేంద్ర కార్యాలయం ఈ వివాదాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రజాస్వామ్యంలో ఓటర్ల స్పష్టత అత్యంత కీలకమైన అంశం కాబట్టి.. ఈ సంక్షిప్త నామాన్ని కొనసాగించడం సాధ్యపడదని ఖరాఖండిగా తేల్చిచెప్పింది. ఈ వివాదం వెనుక భారత్ రాష్ట్ర సమితి వ్యూహాత్మక పాత్ర పోషించిందని రాజకీయ వర్గాలు బలంగా విశ్లేషిస్తున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘానికి అందిన వందలాది ఫిర్యాదుల్లో అత్యధిక భాగం బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అనుచరులు పంపినవేనని విశ్వసనీయ సమాచారం. కేవలం వ్యక్తిగత అభ్యంతరాలకే పరిమితం కాకుండా.. బీఆర్ఎస్ పార్టీ అధికారికంగా ఒక సుదీర్ఘమైన ఫిర్యాదు పత్రాన్ని ఈసీఐకి సమర్పించింది. 14 ఏండ్ల పాటు సాగిన సుదీర్ఘ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ చరిత్రలో టీఆర్ఎస్ అనే అక్షరాలు ప్రజల భావోద్వేగాలతో, ఆకాంక్షలతో ముడిపడి ఉన్నాయని వారు తమ లేఖలో ప్రధానంగా నొక్కిచెప్పారు. జాతీయ రాజకీయాల కోసం తమ పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చుకున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో కోట్లాది మంది ప్రజలు ఇప్పటికీ ఈ ప్రత్యామ్నాయ నామాన్ని ఒకే శక్తంగా పరిగణిస్తారని వివరించారు. ఇటువంటి సున్నితమైన పరిస్థితుల్లో అదే సంక్షిప్త నామాన్ని మరొకరికి కేటాయించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీల పేర్లు ఒకదానిని ఒకటి పోలి ఉండకూడదనే ప్రాథమిక నియమాన్ని ఇక్కడ ప్రధానంగా ప్రస్తావించారు. కొత్త పార్టీకి ఇదే పేరును అనుమతిస్తే రాబోయే సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు తీవ్ర అయోమయానికి గురవుతారని ఈసీఐకి సమర్పించిన నివేదికలో బీఆర్ఎస్ ఆందోళన వ్యక్తంచేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యమ గుర్తింపును వాడుకోవాలని చూడటం సమంజసం కాదని వాదించింది. ఈ క్రమంలోనే సదరు సంక్షిప్త నామాన్ని భవిష్యత్తులో ఏ ఒక్క కొత్త రాజకీయ గ్రూపునకు కూడా కేటాయించవద్దని కేంద్ర ఎన్నికల సంఘాన్ని అధికారికంగా విజ్ఞప్తి చేసింది. ఒకప్పుడు పార్టీ నుంచి బహిష్కరణకు గురైన కవిత.. పాత ప్రజాదరణను దక్కించుకోవాలనే ఏకైక ఉద్దేశంతోనే తెలంగాణ రక్షణ సేన అనే పేరును ఎంచుకున్నారని వారు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. రాజకీయంగా తమ ఉనికిని దెబ్బతీసేందుకే ఈ తరహా నామకరణ వ్యూహాన్ని అమలు చేశారని గుర్తిస్తూ గట్టి కౌంటర్ ఇచ్చారు. ఈ పేరుపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన వారిలో కేవలం బీఆర్ఎస్ మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల సంస్థలు కూడా ఉండటం విశేషం. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా సామాజిక సేవలందిస్తున్న 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' అనే స్వచ్ఛంద సంస్థ సైతం రంగంలోకి దిగింది.

# మబ్బులు తప్ప వానలు కురవలే

**మొదటిపేజీ తరువాయి**



గత సంవత్సరం 2025లో పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. అప్పట్లో హైదరాబాద్‌లో 78 శాతం, మేడ్చల్‌లో 66 శాతం లోటు ఉండేది. ఈసారి రంగారెడ్డి జిల్లాలో మాత్రం అంచనాలకు భిన్నంగా 2 శాతం అదనపు వర్షపాతం నమోదు కావడం గమనార్హం. వాతావరణ శాఖ నిబంధనల ప్రకారం సాధారణ వర్షపాతానికి 19 శాతం అటుఇటుగా నమోదైనా దానిని సాధారణంగానే గుర్తిస్తారు. ప్రస్తుత సీజన్‌లో కురిసిన కొన్ని వానలు కూడా ఒకే చోట కేంద్రీకృతమై భారీగా పడటం వల్ల నీరంతా వృథాగా పోయింది. ఆ తదుపరి రోజుల్లో వానదేవుడు ముఖం చాటేయడంతో వర్షపాత విస్తరణ ఏకరీతిగా సాగలేదు. గత సంవత్సరంతో పోలిస్తే కొన్ని ప్రాంతాల్లో గణాంకాలు మెరుగ్గా కనిపిస్తున్నా, భూగర్భ జలమట్టాల్లో ఎలాంటి ఆశాజనక మార్పులు రాలేదు. కాంక్రీట్ కట్టడాల కారణంగా నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేకపోవడం పెద్ద శాపంగా మారింది. నగరంలోని కొన్ని కాలనీల్లో బోరుబావులు ఇప్పటికే ఎండిపోవడం, ట్యాంకర్లపై ఆధారపడాల్సి రావడం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. రాబోయే జూలై, ఆగస్టు మాసాల్లోనైనా భారీ వర్షాలు కురిసి జలాశయాలు నిండితేనే నగరానికి తాగునీటి ఎద్దడి తప్పుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నగరంలో శుక్రవారం పగలు, రాత్రి వేళల్లో నమోదైన ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం కేవలం 5 డిగ్రీలకే పరిమితం కావడం విశేషం. పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత 29.2 డిగ్రీలుగా రికార్డవ్వగా, ఇది సాధారణం కంటే 4 డిగ్రీలు తక్కువ. రాత్రి వేళల్లో అత్యల్ప ఉష్ణోగ్రత 24.5 డిగ్రీలుగా నమోదైంది. చల్లటి గాలుల వల్ల నగరంలోని దిల్‌సుఖ్‌నగర్, ముషారాంబాగ్, బంజారాహిల్స్, ట్యాంక్‌బండ్, అంబర్‌పేట, ఖైరతాబాద్, కోఠి, నల్గొండ జంక్షన్ ప్రాంతాల్లో మోస్తరు వానలు పడ్డాయి. ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా పడిపోవడంతో నగర వ్యాప్తంగా ఏసీలు, కూలర్ల వినియోగం చాలా వరకు తగ్గింది. దీనివల్ల హైదరాబాద్ నగరంలో విద్యుత్ డిమాండ్ ఏకంగా 3,300 మెగావాట్లకు పడిపోయింది. సాధారణ రోజుల్లో ఉండే లోడ్‌తో పోలిస్తే ఇది విద్యుత్ శాఖకు పెద్ద ఊరటనిచ్చింది. ఉక్కపోత నుంచి ఉపశమనం లభించినా, నగర చెరువులు నిండే స్థాయి వర్షం లేకపోవడం పెద్ద కొరతగా మారింది. పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులే ఈ వాతావరణ మార్పులకు ప్రధాన కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్. స్టెల్లా వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఎల్‌నినో ప్రభావం జూలై, ఆగస్టు నెలల్లో మధ్యస్థంగా కొనసాగుతుంది. సెప్టెంబర్ మాసం నాటికి ఇది మరింత బలపడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీని తీవ్రత కారణంగా ప్రస్తుత నైరుతి రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది. మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్ర ఉపరితలంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే విపరీతంగా పెరగడం వల్ల ఈ వ్యవస్థ ఏర్పడుతుంది. సముద్రపు వేడి గాలి ఎగువన ఉన్న వాతావరణ పొరల్లో తీవ్రమైన వైరుధ్యాలను సృష్టిస్తుంది. ఈ గ్లోబల్ వాతావరణ మార్పుల ప్రభావం నేరుగా భారతీయ రుతుపవనాల గమనాన్ని దెబ్బతీస్తోంది. తెలంగాణలోని ఇతర జిల్లాలతో పోలిస్తే హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షపాత విస్తరణలో తీవ్ర వ్యత్యాసాలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్ జిల్లాలో గత ఏడాది 66 శాతం లోటు ఉండగా, ఈసారి 46 శాతానికి చేరింది. రంగారెడ్డి జిల్లా గత ఏడాది 47 శాతం లోటును చవిచూడగా, ఈసారి 2 శాతం మిగులు సాధించడం కొంత ఉపశమనం కలిగించే అంశం. వాతావరణ కేంద్రం లెక్కల ప్రకారం, జూన్ నెలలో కురవాల్సిన సగటు వర్షపాతంలో సగం కూడా నమోదు కాని ప్రాంతాలు నగరంలో చాలా ఉన్నాయి. వర్షాలు పడే రోజుల్లో తీవ్రత ఎక్కువగా ఉండి, ఆ తర్వాత సుదీర్ఘ పొడి కాలం కొనసాగుతోంది. ఈ విధమైన వర్షపాత తీరు వల్ల వ్యవసాయ రంగానికే కాకుండా, పట్టణ నీటి సరఫరా వ్యవస్థకు పెద్ద సవాలుగా మారుతోంది. జలాశయాల్లోకి వరద నీరు రాకపోతే రాబోయే కాలంలో జల సంక్షోభం తీవ్రరూపం దాల్చే ప్రమాదముంది. భూగర్భ జలాలు పెరగకపోవడానికి కేవలం వర్షపాత లోటు మాత్రమే కారణం కాదని, నగరంలో మౌలిక వసతుల నిర్మాణ తీరు కూడానని పర్యావరణవేత్తలు చెప్తున్నారు. కురిసిన కొద్దిపాటి వర్షపు నీరు డ్రైనేజీల ద్వారా నాలాల్లోకి, అక్కడి నుంచి మూసీ నదిలోకి వృథాగా కొట్టుకుపోతోంది. గతంలో నగరంలో ఉన్న వందలాది చెరువులు ఆక్రమణలకు గురికావడం వల్ల నీరు నిల్వ ఉండే సామర్థ్యం దారుణంగా పడిపోయింది. జూన్ నెలలో కురిసిన అరకొర వానలు కేవలం రోడ్లను తడపడానికే సరిపోయాయి. భూమి పొరల్లోకి నీరు ఇంకేందుకు అవసరమైన ఇంకుడు గుంతల నిర్వహణను నగరవాసులు విస్మరించడం వల్ల సంక్షోభం మరింత ముదురుతోంది. 2025 నాటి భారీ వర్షపాత లోటు సృష్టించిన గాయాలు ఇంకా మానకముందే, ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతం కావడం భవిష్యత్తుపై ఆందోళనను పెంచుతోంది. రాబోయే ఆగస్టు, సెప్టెంబర్ నెలలపైనే ఇప్పుడు వాతావరణ శాస్త్రవేత్తలు, నగర పాలక సంస్థ అధికారులు ఆశలు పెట్టుకున్నారు. ఎల్‌నినో ప్రభావం సెప్టెంబర్‌లో బలపడితే రుతుపవనాల ఉపసంహరణ త్వరగా జరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. నగరంలోని జలవనరుల శాఖ అధికారులు జలాశయాల నీటి మట్టాలను ప్రతిరోజూ సమీక్షిస్తున్నారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ వంటి ప్రధాన తాగునీటి వనరుల్లోకి ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వరద నీరు చేరలేదు.

# ఒంటరైన అన్నదాత..!

**మొదటిపేజీ తరువాయి**



'అప్పుల' పంచాయితీ చుట్టూనే తిరుగుతున్నాయి. గత పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.6.71 లక్షల కోట్ల అప్పులపై శ్వేతపత్రాలు, సవాళ్లు విసురుకోవడంలోనే ప్రధాన పార్టీలు మునిగిపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లా పర్యటనలో చేసిన వ్యాఖ్యలు ఈ రాజకీయ హైడ్రామాకు తెరలేపాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య సాగుతున్న ఈ ఆర్థిక యుద్ధం వల్ల అసలు సిసలైన ప్రజా సమస్యలు పక్కదారి పట్టాయి. ఖరీఫ్ సాగు కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 60 లక్షల ఎకరాల్లో రైతులు విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. సమయానికి పెట్టుబడి సాయం అందక, బ్యాంకుల నుంచి కొత్త రుణాలు లభించక సగటు రైతు ఇబ్బందులు పడుతున్నాడు. ఈ ఆర్థిక ఇబ్బందులను అధిగమించే మార్గాలను చూపించాల్సిన నాయకులు కేవలం టెలివిజన్ చర్చలు, ప్రెస్ మీట్లకు పరిమితమై పరస్పర దూషణలతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రతిపక్ష పాత్రలో ఉన్న భారత్ రాష్ట్ర సమితి అకస్మాత్తుగా తన రాజకీయ వ్యూహాన్ని మార్చుకుంది. నిన్నటివరకు రైతు భరోసా బకాయిలు, ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం డిమాండ్ చేసిన కేటీఆర్, హరీశ్‌రావు ఇప్పుడు మౌన ముద్ర ఆశ్రయించారు. గురుకుల టెండర్లలో జరిగిన రూ.500 కోట్ల అవకతవకలు, గత ప్రభుత్వ హయాంలో జరిగిన సచివాలయ నిర్మాణ వ్యయాల వంటి అంశాలపైనే కాంగ్రెస్‌ను నిలదీస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో రైతులకు ప్రభుత్వం అందజేసిన రూ.7,500 కోట్ల పెట్టుబడి సాయం వల్ల అధికార పక్షానికి ఎక్కడ మైలేజ్ వస్తుందోననే ఆందోళన వారిలో కనిపిస్తోంది. అందుకే వ్యూహాత్మకంగా అప్పుల అంశాన్ని ముందుకు తెచ్చి అసలు చర్చను డైవర్ట్ చేశారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న విత్తనాల కొరత, నకిలీ పురుగుల మందుల ముఠాల దందా వంటి కీలక విషయాలను గులాబీ దళం అసెంబ్లీ వేదికగా గానీ, ప్రజా బాహుళ్యంలో గానీ బలంగా వినిపించలేకపోతోంది. ఇక జాతీయ పార్టీ అయిన భారతీయ జనతా పార్టీ కూడా రాష్ట్రంలో పూర్తిగా తన ఉనికిని కోల్పోయినట్లు కనిపిస్తోంది. ధాన్యం కొనుగోళ్ల సమయంలో జిల్లాల్లో 'బీజేపీ భరోసా' పేరుతో విస్తృతంగా పర్యటించిన స్టేట్ చీఫ్ రాంచందర్‌రావు ఇప్పుడు జిల్లాల వైపు చూడటం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సబ్సిడీ పథకాలను ప్రచారం చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు, రెండేళ్ల తర్వాత రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 60 కంటే ఎక్కువ స్థానాలు సాధించడమే లక్ష్యంగా కొత్త యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోతున్న నారుమళ్లను పరిశీలించడానికి బీజేపీ అగ్రనాయకత్వం సమయం కేటాయించడం లేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే క్రతువును విస్మరించి, కేవలం పట్టణ ఓటర్లను ఆకర్షించేలా పొలిటికల్ యాక్టివిటీస్ నిర్వహిస్తుండటం పట్ల రైతు సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంత పేద ప్రజల జీవనాధారమైన ఉపాధి హామీ పథకంలో కేంద్రం తెచ్చిన మార్పులపై ఎవరూ నోరెత్తడం లేదు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన 'జీరామ్‌జీ' చట్టం కూలీలకు పెద్ద శాపంగా మారింది. ఈ కొత్త చట్టం ప్రకారం రాష్ట్రాలు తమ వంతుగా 40 శాతం నిధులను విధిగా భరించాల్సి ఉంటుంది. నిధుల కొరతతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం దీనిని ఎలా అధిగమిస్తుందో స్పష్టత లేదు. వ్యవసాయ సీజన్ సమయంలో కూలీలకు 60 రోజుల పాటు విరామం ప్రకటించాలనే నిబంధన గ్రామీణ పేదలను ఆకలికేకల్లోకి నెట్టేసే ప్రమాదం ఉంది. ఈ నూతన విధానం వల్ల రాష్ట్రంలోని సుమారు 55 లక్షల మంది ఉపాధి కార్డు దారులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఈ విషయమై సీపీఐ, సీపీఎం, టీజేఎస్ వంటి లెఫ్ట్, ప్రాంతీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు కూడా విచిత్రంగా మారాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల గుట్టలను ప్రజల ముందు ఉంచడానికే కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తోంది. దాదాపు రూ.40,000 కోట్ల మేర ఉన్న రైతు రుణమాఫీ నిధులను ఒకే విడతలో ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చడంలో జాప్యం జరుగుతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలకు బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాల్సి రావడంతో వ్యవసాయ రంగానికి కోత పడింది. అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా వ్యవసాయ కమిషన్ నియమించలేదు. పంటల భీమా పథకానికి సంబంధించిన రూ.1,200 కోట్ల ప్రీమియం చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. పాలక పక్షం ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడానికే తమ శక్తినంతా ధారపోస్తోంది తప్ప, క్షేత్రస్థాయిలో కరవును ఎదుర్కొనేందుకు మండలాల వారీగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. రాజకీయ పార్టీల ఎజెండాల మార్పు వల్ల అన్నదాత ఒంటరివాడైపోయాడు. ఒకవైపు ప్రకృతి కన్నెర్ర జేసి వర్షాలు పడక పోయినా, మరోవైపు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోయినా అడిగే దిక్కులేకుండా పోయింది. గతంలో వ్యవసాయ సంక్షోభం ఏర్పడినప్పుడు 24 గంటల విద్యుత్, సాగునీటి సరఫరాపై నిరంతర సమీక్షలు జరిగేవి. ఇప్పుడు విద్యుత్ కోతలు 5 గంటల కంటే ఎక్కువ సమయం ఉంటున్నా అధికారులు స్పందించడం లేదు. నకిలీ విత్తనాల వల్ల ఏటా సుమారు రూ.800 కోట్ల నష్టం జరుగుతున్నా టాస్క్‌ఫోర్స్ దాడులు నామమాత్రంగానే సాగుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి, పాలకులు వాటిని సరిదిద్దుకోవాలి. తెలంగాణలో మాత్రం సీన్ రివర్స్ అయింది. ప్రజా సమస్యలను పక్కనబెట్టి తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడమే పరమావధిగా పార్టీలు ప్రవర్తిస్తున్నాయి. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే రాష్ట్ర వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయంగా కనిపిస్తోంది.




# రోటరీ క్లబ్ భద్రాచలం ప్రెసిడెంట్ గా షేక్.అజీమ్

**సేవే పరమావధి.. కార్మిక నేతగా ప్రత్యేక ముద్ర**

**అశ్వాపురం, విశాల భారతి :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం, విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై స్పందిస్తూ నాయకత్వ లక్షణాలను అలవాటు చేసుకున్న అజీమ్ రోటరీ క్లబ్ భద్రాచలం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. జూలై 19 అధికారకంగా బాధ్యతలు చేపట్టనున్నారు. తన సేవా ప్రస్తానాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లనున్నారు . ఆయన సుదీర్ఘ సామాజిక రాజకీయ ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

**ప్రజా సేవలో విశిష్ట ప్రస్థానం**

చిన్న వయసులోనే విద్యార్థి నాయకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన అజీమ్, ఆ తర్వాత నందమూరి అభిమాన సంఘ నాయకుడిగా యువతను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో వివిధ స్థాయిల్లో బాధ్యతలు చేపట్టి ప్రజలకు నేరుగా అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారు.

**కార్మిక నేతగా ప్రత్యేక ముద్ర**

ఐటీసీ కర్మాగారంలో ప్రస్తుతం యూనియన్ జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్న అజీమ్ తనదైన ముద్రవేశారు. కేవలం హోదాకే పరిమితం కాకుండా కార్మికుల హక్కులు, సంక్షేమం, ధ్యేయంగా పనిచేశారు. సమస్యల మూలాలను గుర్తించి శాస్త్రీయబద్ధమైన సర్వేల ఆధారంగా పరిష్కారం చూపడం ఆయన పనితీరులో ప్రత్యేకత.

**నిరంతర సేవా ప్రవాహం**

రాజకీయాలకు అతీతంగా మరింత విస్తృతంగా ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో, గత దశాబ్ద కాలం గా ఆయన అంతర్జాతీయ రోటరీ క్లబ్ లో క్రియాశీలక సభ్యుడుగా కొనసాగుతున్నారు. ముఖ్యంగా 2019 20 లో కరోనా మహమ్మారి సమయంలో అజీమ్ అందించిన సేవలు అభినందనీయం. క్లిష్ట సమయంలో ఎందరో బాధితులకు అండగా నిలిచి సేవా కార్యక్రమాలు సమన్వయం చేయడంలో ఆయన ముందున్నారు.

**రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా లక్ష్యాలు**

ప్రస్తుతం రోటరీ క్లబ్ భద్రాచలం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అజీమ్ సంస్థను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వెయ్యనున్నారు. పేద విద్యార్థులకు విద్యను, సామాన్యులకు మెరుగైన ఆరోగ్య సదుపాయాలను, అందించడం, భద్రాచలం ప్రాంతంలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు విస్తరించడం, నిస్వార్థమైన సేవతో క్లబ్బుకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తానని ఈ సందర్భంగా అజయ్ తెలిపారు. నాయకత్వం నిబద్ధత, సేవాభావం, కలిగిన అజీమ్ ప్రస్థానం భద్రాచలం ప్రాంత ప్రజల్లో ఆయనకు ప్రత్యేక గౌరవం పెంచింది.

# స్వాతంత్ర ఉద్యమంలో పింగళి వెంకయ్య చేసిన సేవలు చిరస్మరణీయం

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్..**



**ముషీరాబాద్, విశాల భారతి:** దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పింగళి వెంకయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంఎల్ఏ ముఠా గోపాల్ కొనియాడారు. పింగళి వెంకయ్య సారక సంస్థ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ చైర్ పర్సన్ శ్యామల రావు ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య 63 వ వర్ధంతి ని పురస్కరించుకొని శనివారం రాంనగర్ ఈ సేవ వద్ద అల్పాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై పింగళి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అల్పాహారం పంపిణీ చేసి మాట్లాడారు. భారత దేశానికి జాతీయ పతాకాన్ని రూపొందించి, దేశ చరిత్రలో ఆయన శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించి, దేశభక్తిని పెంపొందించడంలో పింగళి వెంకయ్య కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఒక తెలుగు మహనీయుడు ఆలోచనల్లో పుట్టిన త్రివర్ణ పతాకం నేడు యావత్ భారతజాతి గర్వానికి ప్రతీకగా నిలిచిందన్నారు. దేశ సమైక్యత, సార్వభౌమత్వం, త్యాగస్ఫూర్తికి చిహ్నంగా ఎగురుతున్న జాతీయ జెండా వెనుక పింగళి వెంకయ్య కృషి ఎన్నటికీ మరువలేనిదని చెప్పారు. ఆయన దేశభక్తి, అంకితభావం ప్రతి భారతీయుడికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రెటరీ జీవన్ కేశవులు, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శేష సాయి, బి ఆర్ ఎస్ నాయకులు సత్యనారాయణ, నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో గచ్చిబౌలిలో మహిళ ఆత్మహత్య



**సైబరాబాద్ – విశాల భారతి:** కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై ఓ వివాహిత అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రానికి చెందిన అరుణ (37)కు తొమ్మిదేళ్ల క్రితం అన్మోల్ కుమార్‌తో వివాహమైంది. అన్మోల్ కుమార్ ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తుండగా, అరుణ గృహిణి. గత ఏడేళ్లుగా ఈ దంపతులు తమ కుమార్తెతో కలిసి మసీద్‌బండలోని 'అపర్ణ సేరెన్' (శరన్ గ్రేటర్ కమిటీ) అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. అయితే, వీరి ఆరేళ్ల కుమార్తె ఆటిజం (మానసిక వికలాంగత్వ సమస్య)తో బాధపడుతోంది. కుమార్తె అనారోగ్య సమస్యల విషయమై గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన అరుణ, శనివారం తెల్లవారుజామున తాను ఉంటున్న అపార్ట్‌మెంట్ 12వ అంతస్తు నుంచి కిందకు దూకేసింది. తీవ్ర గాయాలవ్వడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు జరుపుతున్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రిన్సిపాల్ సుధా**



**సైబరాబాద్ విశాల భారతి :** మహానగరంలో వాహనాల వల్ల పెరిగిపోతున్న కాలుష్యానికి అడ్డుకట్ట వేయాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కొండాపూర్ శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రిన్సిపాల్ సుధా పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం పాఠశాల విద్యార్థులతో కలిసి బొటానికల్ గార్డెన్ వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చేతుల్లో మొక్కలు, ప్లకార్డులు పట్టుకుని తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో పర్యావరణ నినాదాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కాలుష్యం వల్ల వస్తున్న ఆరోగ్య సమస్యల నుంచి తప్పించుకోవడానికి వృక్షో రక్షిత రక్షితః అనే సూత్రాన్ని పాటించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, చెత్తను పద్ధతిగా నిర్మూలించాలని కోరారు. అనంతరం స్కూల్ ఆవరణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆమె మొక్కలు నాటారు.

# ఒకే నంబర్‌కు 700 ఓట్లు.. ఎన్నికల జాబితాలో భారీ గందరగోళం!

**కాంగ్రెస్ సంచలన ఆరోపణలు.. నార్సింగిలో ఓటర్ల డేటాపై అనుమానాలు**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** కాంగ్రెస్ పార్టీ నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తూ, ఒకే మొబైల్ నంబర్‌కు 700కి పైగా ఓటర్లు నమోదైనట్లు ఆరోపించింది. టీపీసీసీ స్టేట్ కోఆర్డినేటర్ వాసిరెడ్డి నరేష్ మీడియాకు తెలిపిన ప్రకారం, ఎన్నికల జాబితా పరిశీలనలో ఈ అసాధారణ విషయం బయటపడింది. ప్రాథమిక విచారణలో ఆ మొబైల్ నంబర్ ఒక రాజకీయ పార్టీ జిల్లా స్థాయి నాయకుడిదిగా గుర్తించినట్లు చెప్పారు. సంబంధిత ఓటర్ల వివరాలు, డబ్ల్యూపీకే నంబర్లతో సహా పూర్తి సమాచారం అధికారులకు అందజేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ విచారణకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల జాబితా పారదర్శకత కోసం పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అయితే, ఈ అంశంపై వివరణ కోరేందుకు పలుమార్లు సంప్రదించినప్పటికీ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి స్పందించలేదని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై కూడా ఆయన స్పందించడంలేదని విమర్శిస్తూ, తన విధానాన్ని మార్చుకోవాలని సూచించారు.

# 'వాక్ ఫ్రీ'తో ఫుట్‌పాత్‌ల ప్రక్షాళన

- ఆల్‌విన్-బీహెచ్‌ఈఎల్ రూట్‌లో ఆక్రమణలపై కొరడా
- మియాపూర్ సర్కిల్‌లో మున్సిపల్-పోలీసుల స్పెషల్ డ్రైవ్




**సైబరాబాద్ విశాల భారతి :** పాదచారులకు అడ్డుగా ఉన్న ఆక్రమణల తొలగింపే లక్ష్యంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శనివారం 'వాక్ ఫ్రీ' స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. కమిషనర్, జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో ఆల్‌విన్ ఎక్స్ రోడ్ నుంచి బీహెచ్‌ఈఎల్ ఎక్స్ రోడ్ వరకు ఫుట్‌పాత్‌లను క్లియర్ చేశారు. మియాపూర్ సర్కిల్ 48 పరిధిలో డిప్యూటీ కమిషనర్ల ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా రంగంలోకి దిగారు.



దుకాణాల బోర్డులు, తోపుడు బండ్లు, అడ్డుగా ఉన్న నిర్మాణాలను జేసీబీలతో తొలగించారు. పాదచారుల భద్రత కోసం సైబరాబాద్ వ్యాప్తంగా ఆక్రమణలు లేని ఫుట్‌పాత్‌లే లక్ష్యంగా 'వాక్ ఫ్రీ' కార్యక్రమాన్ని దశలవారీగా కొనసాగిస్తామని కమిషనర్ వెల్లడించారు.

# పరారీలో నిందితులు... పోలీసులు ఎందుకు మౌనం....?

- రాజకీయ అండతో చట్టాన్ని ధిక్కరిస్తున్నారా....?
- కేసు నమోదై రోజులు గడుస్తున్నా అరెస్టులు ఎక్కడ...?

**బోడుప్పల్ విశాల భారతి**




బోడుప్పల్ దేవేందర్ నగర్‌లో జరిగిన దాడి ఘటనకు సంబంధించి కేసు నమోదై రోజులు గడుస్తున్నప్పటికీ, పలువురు నిందితులు ఇప్పటికీ పరారీలో ఉండడం తీవ్ర చర్చకు దారితీసింది. దర్యాప్తు జరుగుతోందని పోలీసులు చెబుతున్నప్పటికీ, ప్రధాన నిందితులు ఇంకా పోలీసుల అదుపులోకి రాకపోవడంపై బాధిత కుటుంబంతో పాటు స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ప్రధాన సూత్రధారులు స్వేచ్ఛగా తిరుగుతున్నారనే ప్రచారం**

స్థానికంగా వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, ఈ ఘటనకు ప్రధాన సూత్రధారులుగా భావిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఎలాంటి భయం లేకుండా ఇతర ప్రాంతాల్లో తిరుగుతూ, టూర్లు ఎంజాయ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు నిజంగా వారిని వెతుకుతున్నారా? లేక కేవలం దర్యాప్తు పేరుతో కాలయాపన చేస్తున్నారా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

**సీడీఆర్ తీస్తే ఆచూకీ దొరుకుతుందనే అభిప్రాయం**

దర్యాప్తులో భాగంగా చట్టబద్ధమైన విధానంలో మొబైల్ కాల్ డీటెయిల్ రికార్డులు (CDR), లొకేషన్ విశ్లేషణ వంటి సాంకేతిక ఆధారాలను వినియోగిస్తే పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ సులభంగా లభించే అవకాశం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే పోలీసులు ఆ దిశగా తగిన చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**సాంకేతిక యుగంలోనూ నిందితులు దొరకకపోవడం ఆశ్చర్యమేనా?**

సీసీ కెమెరాలు, మొబైల్ టవర్ లొకేషన్లు, డిజిటల్ ఆధారాలు అందుబాటులో ఉన్న ఈ రోజుల్లోనూ నిందితులను గుర్తించలేకపోవడం సహజమేనా అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. సాంకేతికంగా బలమైన దర్యాప్తు జరిగితే నిజాలు త్వరగా బయటపడతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**రాజకీయ అండ ఉందనే ఆరోపణలు**

ఈ కేసులో కొందరు రాజకీయ నాయకులు నిందితులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అదే కారణంగా దర్యాప్తు వేగం తగ్గిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు.

**బాధిత కుటుంబంలో భయాందోళనలు**

ప్రధాన నిందితులు ఇంకా అరెస్టు కాకపోవడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉందని సమాచారం. నిందితులు బయట తిరుగుతున్నారనే ప్రచారం కారణంగా మళ్లీ ఎలాంటి ఘటన జరుగుతుందోననే భయం వారిని వెంటాడుతోందని స్థానికులు చెబుతున్నారు.

**చట్టం ముందు అందరూ సమానమేనా?**

సామాన్య ప్రజల విషయంలో వేగంగా స్పందించే పోలీసులు, ఈ కేసులో మాత్రం ఎందుకు అదే వేగాన్ని చూపడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. చట్టం ముందు అందరూ సమానమే అయితే, ఈ కేసులోనూ అదే సూత్రం అమలు కావాలని ప్రజలు కోరుతున్నారు.

**పోలీసులపై పెరుగుతున్న అనుమానాలు**

నిందితులు అందుబాటులో ఉన్నప్పటికీ అరెస్టులు జరగడం లేదనే ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీనివల్ల పోలీసు శాఖ పనితీరుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలకు తెరపడాలంటే దర్యాప్తులో వేగం పెంచి, చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలన్న డిమాండ్**

ఈ కేసులో ఉన్నత పోలీసు అధికారులు స్వయంగా జోక్యం చేసుకుని దర్యాప్తు పురోగతిని సమీక్షించాలని, పరారీలో ఉన్న నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టం ముందు నిలబెట్టాలని స్థానికులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**ప్రజలు ఎదురుచూస్తున్నది ఒక్కటే... న్యాయం**

కేసు నమోదు చేయడం ఒక్కటే సరిపోదని, నిందితులను చట్టం ముందు నిలబెట్టి బాధితులకు న్యాయం చేయడమే పోలీసు శాఖ అసలు బాధ్యత అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ కేసులో తీసుకునే తదుపరి చర్యలే పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని నిర్ణయిస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

# వడ్డీ మాయలో వేల కోట్లకు టోకరా

- 'కిసాన్ పరివార్' పేరిట భారీ కుంభకోణం
- దేశవ్యాప్తంగా 6వేల మంది బలి
- సూత్రధారి భూపాల్ నాయక్ అరెస్ట్
- సీపీ కార్యాలయానికి బాధితుల క్యూ

**సైబరాబాద్ - విశాల భారతి**




అధిక వడ్డీ ఆశ చూపి అమాయకులను నమ్మించి కోట్లకు కోట్లు దండుకున్న 'కిసాన్ పరివార్' ఘరానా మోసం బట్టబయలైంది. కిసాన్ పరివార్, కిసాన్ పరివార్ లిమిటెడ్, కిసాన్ పరివార్ ఇండస్ట్రీస్, షేర్స్ బజార్ పేరిట సంస్థలు స్థాపించిన భూపాల్ నాయక్, అధిక వడ్డీలు ఇస్తామంటూ పెట్టుబడిదారులను వలలో వేసుకుని చివరికి బోర్డు తిప్పేశాడు. ఈ కుంభకోణంలో దేశవ్యాప్తంగా సుమారు 6 వేల మంది బాధితులు కాగా, రూ.6 వేల కోట్ల మేర వసూళ్లకు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే 1200 మంది వరకు మధ్యతరగతి ప్రజలు ఈ మోసానికి బలయ్యారు.ఈ భారీ స్కామ్‌పై గుజరాత్ పోలీసులు గతంలోనే భూపాల్ నాయక్‌పై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. పది రోజుల క్రితం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిందితుడిని శంషాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకుని గుజరాత్ పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం నిందితుడిని గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.ఇదిలా ఉండగా, తమకు జరిగిన అన్యాయంపై బాధితులు శనివారం సైబరాబాద్ సీపీ కార్యాలయంలో ఈవోడబ్ల్యూ అధికారులను ఆశ్రయించారు. 2022 నుంచి ఈ సంస్థలో పెట్టుబడులు పెడుతున్నామని, మొదట ఏడాది పాటు వడ్డీలు సక్రమంగా చెల్లించి నమ్మకం కలిగించి ఆ తర్వాత ముంచేశారని బాధితుడు సుభాష్ రెడ్డి మీడియా ఎదుట వాపోయాడు. 'నా కూతురి పెళ్లి కోసం దాచిన డబ్బులన్నీ ఎక్కువ వడ్డీ వస్తుందని ఇందులో పెట్టాను. వీళ్లు బోర్డు తిప్పేయడంతో అప్పులు చేసి పెళ్లి చేయాల్సి వచ్చింది. మాలాంటి మధ్యతరగతి వాళ్లంతా రోడ్డున పడ్డాం. ప్రభుత్వమే చొరవ తీసుకుని న్యాయం చేయాలి' అని బాధితురాలు మాధవి కన్నీటిపర్యంతమయ్యారు.బాధితుల ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కంపెనీల పేరిట వేల కోట్లు వసూలు చేసిన ఈ భారీ స్కామ్‌పై ఈవోడబ్ల్యూ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# చిన్నారి వైద్య సేవలకు విరాళం అందించిన పద్మారావు గౌడ్

- విబ్సన్ ఫార్మా ద్వారా విరాళానికి ఏర్పాట్లు
- చిన్నారిని ఆదుకోవాలని ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రికి లేఖలు

**సికింద్రాబాద్, విశాలభారతి :**



అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారి దయనీయ పరిస్థితి కి చాలించిన సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆమె వైద్యానికి తక్షణ సాయంగా తన వ్యక్తిగత విరాళాన్ని అందించడంతో పాటు తన వంతు సంపూర్ణ సహకారాన్ని అందించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. రామంతాపూర్ ప్రాంతానికి చెందిన భేరి రమేష్ డ్రైవరు గా పని చేస్తున్నాడు. గత నవంబరు లో తమకు జన్మించిన పాపకు చైత్రిక అని పేరు పెట్టుకొని రమేష్ దంపతులు అల్లారుముద్దుగా పెంచుకుంటున్న దశలో ఆమె కు అరుదైన వ్యాధి సోకింది. కండరాలు బాలహీనపడి శ్వాస తీసుకోవడం కూడా కష్ట తరంగా మారిన దశలో వైద్యలను సంప్రదహించగా సుమారు ఆరు నెలల చైత్రిక కు అత్యంత అరుదైన జన్యు వ్యాధి ఉందని, స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనే వ్యాధికి ఏకంగా రూ.10 కోట్లతో ఇంజక్షన్ తీసుకోవాలని ప్రముఖ వైద్యులు తేల్చి చెప్పారు. శోకం లో మునిగి పోయిన కుటుంబ సభ్యులు వెంటనే సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ ను సంప్రదహించగా వారికి పద్మారావు గౌడ్ భరోసా కల్పించారు. తన వంతు వ్యక్తిగత విరాళంగా లక్ష రూపాయల చెక్కును చైత్రిక తండ్రి రమేష్ కు శనివారం సీతాఫలమండీ లోని తమ కార్యాలయంలో అందించారు. అదే విధంగా తన సన్నిహితుడైన బీ. ఆర్. ఎస్. పార్టీ సీనియర్ నాయకుడు, ప్రముఖ ఫార్మా సంస్థ విబ్సన్ యజమాని సుంకు రామచందర్ ను సంప్రదించి ఆయన ద్వారా మరో లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. అదే విధంగా చిన్నారి వైద్య ఖర్చుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సహకరించాలని కోరుతు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి లకు పద్మరావు గౌడ్ లేఖలు పంపారు. తమ చిన్నారి ఇబ్బందిని గుర్తించి తన వంతు సహకరించిన శాసనసభ్యులు పద్మారావు గౌడ్, బీ. ఆర్. ఎస్. సీనియర్ నాయకులు, సోషల్ వర్కర్ సుంకు రామ్ చందర్ లకు రమేష్ దంపతులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎస్‌ను కలిసిన ఆర్ఆర్ మెడికల్ చైర్మన్

**విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (సీఎస్) బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును ఆర్ఆర్ మెడికల్ చైర్మన్ రమణా రెడ్డి, నాగరాజ్ మరియు సీనియర్ జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



# మాదకద్రవ్యాలపై సైబరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

- రూ.5 కోట్ల విలువైన 833 కిలోల డ్రగ్స్ దహనం
- 8వ విడతలో 101 కేసుల సరుకు ధ్వంసం: డీసీపీ ముత్యంరెడ్డి



**మాదకద్రవ్యాల దహనం ప్రక్రియను పర్యవేక్షిస్తున్న డీసీపీ ముత్యంరెడ్డి, పోలీసు అధికారులు**

**సైబరాబాద్ విశాల భారతి:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 101 ఎన్‌డీపీఎస్ కేసుల్లో పట్టుబడిన రూ.5.02 కోట్ల విలువైన 833.118 కిలోల మాదకద్రవ్యాలను శనివారం దహనం చేశారు.సీపీ ఎం. రమేశ్ ఆదేశాలతో డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, డీసీపీ ఏ. ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో నందిగామ మండలం ఎదులపల్లిలోని జీజే మల్టీక్లేవ్ సంస్థలో పర్యావరణ నిబంధనల ప్రకారం ఇన్సినరేటర్‌లో ధ్వంసం చేశారు.ధ్వంసం చేసిన మాదకద్రవ్యాల్లో 797 కిలోల 841 గ్రాముల గంజాయి, 7 కిలోల 970 గ్రాముల అల్ప్రజోలం, 1 కిలో 658 గ్రాముల హాషిష్ ఆయిల్, 24 కిలోల 640 గ్రాముల గంజా చాక్లెట్లు, 912 గ్రాముల గంజా మొక్కలు, 92 గ్రాముల చరస్, 0.005 గ్రాముల ఎండీఎంఏ ఉన్నాయి. మొత్తం 7 రకాల డ్రగ్స్‌ను 8వ విడతలో భాగంగా దహనం చేశారు.డ్రగ్స్ రహిత సమాజం కోసం కఠిన చర్యలు కొనసాగిస్తాం' అని డీసీపీ ముత్యంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కళకు 'నృత్య దేవ అర్చన' నీరాజనం

- శాస్త్రీయ నృత్యాలతో కొండాపూర్‌లో సాంస్కృతిక సందడి
- యువ కళాకారుల ప్రతిభకు వేదికగా ట్రస్ట్ సేవలు



**సైబరాబాద్ విశాల భారతి:** భారతీయ శాస్త్రీయ నృత్య వైభవాన్ని చాటేలా డొయన్స్ కాలనీలోని నారాయణీ నాట్యాలయ ట్రస్ట్ 'నృత్య దేవ అర్చన' 2వ వార్షిక వేడుకలను శనివారం అట్టహాసంగా నిర్వహించింది.ఈ వేదికపై మహతి భిక్షూ కూచిపూడి, సబర్నిక్ డీ ఒడిస్సీ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. 'సంప్రదాయ నృత్యాలను భావితరాలకు అందించడం, హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల యువ కళాకారులకు ప్రదర్శన అవకాశాలు కల్పించడమే మా ధ్యేయం' అని ట్రస్ట్ వ్యవస్థాపకుడు, భరతనాట్య గురువు సంతోష్ కుమార్ తమాంగ్ పేర్కొన్నారు.

# 60 గజాల ఇళ్ల స్థలాల బాధితులకు బీజేపీ అండ

**ప్రభుత్వం వెంటనే స్థలాలు చూపించి న్యాయం చేయాలి: మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం**



**మొయినాబాద్, విశాలభారతి:** 60 గజాల ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న హిమాయత్‌నగర్ గ్రామస్తులకు బీజేపీ అండగా ఉంటుందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం హామీ ఇచ్చారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 151లో 290 మంది పట్టాదారులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం 9వ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దీక్షా శిబిరాన్ని సందర్శించిన కేఎస్ రత్నం బాధితులకు సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 290 మంది పేదలకు 60 గజాల ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినా, ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలాలను కేటాయించలేదని విమర్శించారు. మొయినాబాద్‌లో ప్రభుత్వ భూములను ఆక్రమించి పెద్ద పెద్ద విద్యాసంస్థలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోకుండా, పేదలకు కేటాయించాల్సిన స్థలాన్ని మార్కెట్ యార్డుకు ఇవ్వడం సరికాదన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెంటనే స్పందించి, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి బాధితులకు ఇళ్ల స్థలాలు చూపించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, సన్వల్లి ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ షాబాద్ కిషన్, బీజేపీ సీనియర్ నాయకులు జెల్లల రవియాదవ్, మహిపాల్, ప్రభాకర్ యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, హిమాయత్‌నగర్ యువజన సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా సరికొండ అనంతరెడ్డి

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను**



**రంగారెడ్డి, జూలై 4 (విశాలభారతి):** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా సరికొండ అనంతరెడ్డిని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా నియమించింది. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, సేవలను గుర్తించి అధిష్ఠానం ఈ కీలక బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నియామకంపై స్పందించిన సరికొండ అనంతరెడ్డి, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. ఆయన నియామకాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సరికొండ అనంతరెడ్డి నాయకత్వంలో రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేసే క్రమంలో వివిధ స్థాయిల్లో కీలక పదవుల నియామకాలు కొనసాగుతున్నాయి.

# ఏఎంవిఐల పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహణ





- రోడ్డు భద్రత, ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేయాలి
- అడిషనల్ కమిషనర్ సి. రమేష్

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఐదు నెలలపాటు శిక్షణ పొందిన 15 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల (ఏఎంవిఐ) పాసింగ్ అవుట్ పరేడ్ శనివారం (04072026) అకాడమీ సెమినార్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రవాణా శాఖ అడిషనల్ కమిషనర్ సి. రమేష్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసిన అధికారులకు అభినందనలు తెలియజేసి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలోనే అత్యుత్తమ పోలీస్ శిక్షణా సంస్థలలో ఒకటైన ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందడం ప్రతి ఏఎంవిఐ కి గొప్ప అవకాశమని పేర్కొన్నారు. రోడ్డు భద్రతను పెంపొందించడం, ప్రమాదాలను తగ్గించడం, ప్రజల ప్రాణాలను కాపాడడం ప్రతి రవాణా శాఖ అధికారి ప్రధాన బాధ్యత అని ఆయన అన్నారు. అధికారులు తమ సేవా జీవితంలో విలువలు, నిజాయితీ, క్రమశిక్షణ, వృత్తిపరమైన ప్రతిష్ఠను కాపాడుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అందిపుచ్చుకుంటూ తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, సీనియర్ అధికారుల మార్గదర్శకత్వం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ఐపీఎస్ మరియు రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, ఐఏఎస్ అందించిన సహకారం ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. శిక్షణ కాలంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ట్రోఫీలు ప్రదానం చేశారు. ఆల్‌రౌండర్ మరియు ఇండోర్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జానకిరాం (ఏఎం విఐ), ఔట్‌డోర్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్రవంతి (ఏఎంవిఐ)లకు అడిషనల్ కమిషనర్ సి. రమేష్ ట్రోఫీలు అందజేసి అభినందించారు. కార్యక్రమం ప్రారంభంలో కోర్స్ డైరెక్టర్ వేమా శ్రీనివాసరెడ్డి స్వాగత ప్రసంగం చేస్తూ, శిక్షణార్థులు ఐదు నెలలపాటు క్రమశిక్షణతో, అంకితభావంతో శిక్షణ పూర్తి చేశారని ప్రశంసించారు. భవిష్యత్తులో ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ సి. రమేష్‌ను అకాడమీ అధికారులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అలాగే డిటిఓ రవీంద్ర కుమార్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి, ఆర్టీవో రఘునందన్ గౌడ్, అసిస్టెంట్ డైరెక్టర్ యార్లగడ్డ రాంబాబు తదితరులు అకాడమీ జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ యార్లగడ్డ రాంబాబు ముఖ్య అతిథికి స్వాగతం పలకగా, రఘునందన్ గౌడ్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సి. రమేష్, అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు పి.ఎస్.ఆర్. మూర్తి, కె.ఆర్.కె. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, ఆర్టీవో రఘునందన్ గౌడ్, డిటిఓ రవీంద్ర కుమార్, ఎంవిఐ శీతల్, డీఎస్పీ రామారావు, ఆదూరి శ్రీనివాసరావు, కృష్ణ, తిరుపతి, జగదీశ్వర్, రవాణా శాఖ అధికారులు, అకాడమీ ఇండోర్ మరియు ఔట్‌డోర్ ఫ్యాకల్టీ సభ్యులు, శిక్షణార్థులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కైతలాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కలికోట శంకర్

- బండి రమేష్ ఆశీస్సులతో బాధ్యతల స్వీకరణ
- రేవంత్ బాటలో సేవ చేస్తానని వెల్లడి



**కూకట్ పల్లి విశాల భారతి:** కైతలాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా కలికోట శంకర్ నియమితులయ్యారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్ ఆదేశాల మేరకు ఆయన ఈ పదవి చేపట్టారు. శనివారం బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. సీనియర్ నాయకుల మద్దతుతో తనను గుర్తించి అవకాశం ఇచ్చినందుకు బండి రమేష్‌కు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. బండి రమేష్ అడుగుజాడల్లో నడుస్తూ, రేవంత్ రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తా. ప్రజా సేవకు ఎప్పుడూ వెనుకాడను' అని శంకర్ అన్నారు. కార్యక్రమంలో మొఇజ్, యూత్ ప్రెసిడెంట్ సలీం, సుల్తాన్, శ్రవణ్, బాలకృష్ణ, నరేందర్, చిన్న, గౌస్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## శంషాబాద్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం – బైరీడ్డి సావంత్ రెడ్డి మృతి









**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం, గోపు శ్రీనివాస్ రెడ్డి (46), మియాపూర్, హైదరాబాద్ నివాసి, కరీంనగర్‌కు చెందిన తన మేనల్లుడు బైరీడ్డి సావంత్ రెడ్డి (21) ప్రమాదంలో మృతి చెందినట్లు ఫిర్యాదు చేశారు. మృతుడు బైరీడ్డి సావంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి కుమారుడు, ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా గీతం యూనివర్సిటీ సమీపంలో ఉంటూ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. తెలుసుకున్న వివరాల ప్రకారం, 03072026 రాత్రి సుమారు 9:00 నుండి 9:30 గంటల మధ్యలో సావంత్ రెడ్డి, తన స్నేహితుడు సాయి రెడ్డి యొక్క ఇన్నోవా క్రిస్టా కారు (నంబర్: AP39RZ 3024)ను అతనికి తెలియకుండా తీసుకుని బయటకు వెళ్లాడు. 04072026 తెల్లవారుజామున సుమారు 3:00 గంటల సమయంలో ఔటర్ రింగ్ రోడ్ (ORR) పెద్దగోల్కొండ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తుండగా, అతివేగంతో వెళ్తున్న ఇన్నోవా కారు ముందుగా వెళ్తున్న రెడీమిక్స్ వాహనం (నంబర్: TS29T9780)ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసమై, డ్రైవింగ్ సీటులో ఉన్న సావంత్ రెడ్డి తీవ్ర రక్త గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న గోపు శ్రీనివాస్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు తన చెల్లెలు కల్పన కుమారుడు అని తెలిపారు. ఈ ఘటనపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇన్స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి తెలిపారు.

## బండ్లగూడ జాగీర్‌లో ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీపై డ్యూటీ .సీఈఓ పరిశీలన

- ప్రతి అర్హ ఓటరుకు ఫారమ్ చేరాలి – అధికారులకు డ్యూటీ .సీఈఓ ఆదేశాలు




**రాజేంద్రనగర్, విశాల భారతి :** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (డ్యూటీ .సీఈఓ) శ్రీ జయచంద్ర రెడ్డి గారు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్ఓ) & డిప్యూటీ కమిషనర్ (డీసీ) శ్రీ బి. సురేందర్ రెడ్డి గారు ఆయనతో కలిసి బండ్లగూడ జాగీర్, సర్కిల్ నెం.19 పరిధిలో ఇంటింటికి జరుగుతున్న ఫారమ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని సమీక్షించారు. ఫీల్డ్ స్థాయిలో జరుగుతున్న పనితీరును అధికారులు సమగ్రంగా పరిశీలించి, ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా మరియు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా, అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారమ్ అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలను సహకరించాలని, సరైన సమాచారం అందించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని వారు పేర్కొన్నారు. అలాగే ఎలాంటి సమస్యలు ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఏఈఆర్ఓ & డీసీ రాజేంద్రనగర్, సర్కిల్ 19, జిహెచ్ఎంసి

## ఫోన్ ట్యాపింగ్ పై టిఆర్ఎస్ పార్టీ నాయకుల పై చర్యలు ఏవి

**కేసులు బుక్ చేస్తామన్న మాటలు ఉత్తవేనా.. ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్**



**ముషీరాబాద్, విశాల భారతి:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో సింగరేణి బొగ్గు కుంభకోణం, కాలేశ్వరంలో జరిగిన అవినీతి, ఫోన్ ట్యాపింగ్ విషయంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్ ప్రశ్నించారు. కేసులు బుక్ చేస్తాం విచారణ చేస్తామని అన్న మాటలు ఉత్తవేనా అని విమర్శించారు. శనివారం అడిక్మెట్ లోని బిజెపి సీనియర్ నాయకులు సాయి కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూల్ పాఠశాల విద్యార్థులకు బుక్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ కె లక్ష్మణ్ హాజరై విద్యార్థులకు బుక్స్ ను పంపిణీ చేసి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు ఈ రాష్ట్రాన్ని పాలించి మొత్తం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. రాష్ట్రంలో జరిగిన అవినీతి కుంభకోణాలపై ఒకరిపై ఒకరు నెపం వేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలు లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే సవాళ్లు ప్రతి సవాళ్లు చేసుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ఎదుగుతున్నందున ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు వార్తల్లో పోటీ పడుతూ విమర్శలు గుప్పించుకుంటున్నారని ఫైర్ అయ్యారు. భారతీయ జనతా పార్టీ ప్రధాని నేతృత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందని బిజెపి పాలిత రాష్ట్రాల అభివృద్ధిని చూసి ఇతర రాష్ట్రాల ప్రజలు బిజెపిని గెలిపించాలని కంకణం కట్టుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, రమేష్ రామ్, కౌండిన్య ప్రసాద్, వెంకటేష్, శేష సాయి తదితరులు పాల్గొన్నారు.

## అమరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి



**విశాల భారతి, గూడూరు :** గూడూరు మండల కేంద్రంలోని తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా కురుమ సంఘం వారు ఆహ్వానించగా అక్కడికి వెళ్లి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించిన గూడూరు మాజీ ఎంపీపీ మాజీ సర్పంచ్ సునావత్ రమేష్ నాయక్ పాల్గొనడం జరిగింది

## చేవెళ్ల జోన్‌లో ఫామ్‌హౌస్‌లకు కొత్త భద్రతా మార్గదర్శకాలు

- నేరాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు
- ఫ్యూచర్ సిటీ సీపీ డా. తరుణ్ జోషి

**మొయినాబాద్, విశాలభారతి:**

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చేవెళ్ల జోన్‌లో ఉన్న ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్స్, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లలో భద్రతను మరింత బలోపేతం చేసి, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ పలు కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వుడ్‌ల్యాండ్స్ రిసార్ట్స్‌లో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సమావేశంలో మొయినాబాద్, షంషాబాద్, చేవెళ్ల, షాబాద్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని 750కు పైగా ఫామ్‌హౌస్‌లు, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌ల యజమానులు, నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఫామ్‌హౌస్, రిసార్ట్‌లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఫుటేజ్‌ను కనీసం 30 రోజుల పాటు భద్రపరచాలని సూచించారు. ప్రతి సందర్శకుడి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయడంతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐడీ ప్రూఫ్‌ను సేకరించాలని ఆదేశించారు. అతిథుల వివరాల నమోదు, భద్రతా నిర్వహణను సులభతరం చేసేందుకు "SAFE ATITHI" డిజిటల్ యాప్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఫామ్‌హౌస్‌ల యజమానులు ఈ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. తల్లిదండ్రులు లేదా చట్టబద్ధ సంరక్షకులు లేకుండా మైనర్లకు ప్రవేశం కల్పించరాదని స్పష్టం చేశారు. అలాగే ఫామ్‌హౌస్‌లలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి అవసరమైన చట్టబద్ధ అనుమతులు ముందుగానే తీసుకోవాలని పేర్కొన్నారు. రేవ్ పార్టీలు, డ్రగ్స్ పార్టీలు, హుక్కా పార్టీలు, చట్టవిరుద్ధ వేడుకలు, జూదం, మానవ అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వబోమని హెచ్చరించారు. నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు ఈగిల్ ఫోర్స్, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (ANB), స్థానిక పోలీసు అధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్, ఐపీఎస్, చేవెళ్ల ఏసీపీ బి. కిషన్, మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్, షంషాబాద్ ఎస్‌హెచ్ఓలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ఫామ్‌హౌస్‌లు, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌ల యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## గచ్చిబౌలి-కొండాపూర్‌లో హైడ్రా కొరడా



కొండాపూర్ ప్రధాన రహదారిలో ఆక్రమణను జేసీబీతో తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

- బొటానికల్ గార్డెన్ నుంచి మసీద్‌బండ వరకు ఆక్రమణల తొలగింపు
- తెల్లవారుజాము 4 నుంచి ఆపరేషన్.. భారీ పోలీసు బందోబస్తు
- రోడ్డుకు ఇరువైపులా వెలసిన అక్రమాలపై సీఎంసీ, హైడ్రా చర్యలు

**సైబరాబాద్ - విశాల భారతి**

గచ్చిబౌలి కొండాపూర్ ప్రధాన రహదారిపై ఏళ్లుగా పేరుకుపోయిన ఆక్రమణలపై హైడ్రా, సీఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. బొటానికల్ గార్డెన్ నుంచి మసీద్‌బండ వరకు రోడ్డుకు ఇరువైపులా వెలసిన అక్రమ కట్టడాలు, షెడ్లు, తోపుడు బండ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలను శనివారం తెల్లవారుజాము నుంచి తొలగించారు. ఉదయం నాలుగు గంటల నుంచే హైడ్రా, సీఎంసీ సిబ్బంది జేసీబీలు, టిప్పర్లతో రంగంలోకి దిగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాలు, దుకాణాల ముందు భాగంలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వేసిన షెడ్లు, బోర్డులు, మెట్లను కూల్చివేశారు. స్థానికులు చూస్తుండగానే జేసీబీలతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు.

**భారీగా ట్రాఫిక్ జామ్...**

ఒకేసారి పెద్ద సంఖ్యలో వాహనాలు, యంత్రాలతో తొలగింపు పనులు చేపట్టడంతో బొటానికల్ గార్డెన్‌మసీద్‌బండ రహదారిలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రధాన రహదారులపై ఆక్రమణల వల్ల ట్రాఫిక్ సమస్యలు, పాదచారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎవరెంతటి వారైనా ఉపేక్షించేది లేదు. ఆక్రమణల తొలగింపు నిరంతరం కొనసాగుతుంది' అని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. ఆక్రమణల తొలగింపుతో రహదారి విశాలంగా మారడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆక్రమణల తొలగింపుతో బొటానికల్ గార్డెన్-మసీద్‌బండ రోడ్డులో ఏర్పడిన భారీ ట్రాఫిక్ జామ్

## ఫీల్ గుడ్ హోమ్స్ కాలనీలో మళ్లీ మురుగునీటి ఉధృతి

**ప్రజల సమస్యలపై స్పందించిన ఏసీఫ్ టీమ్ – డీఈఈ యాదయ్యతో సమీక్ష**





**రాజేంద్రనగర్, విశాలభారతి:** ఫీల్ గుడ్ హోమ్స్ కాలనీలో రోడ్డుపై ఏర్పడిన కాలువ మురుగు నీటి సమస్యపై ఏసీఫ్ బృందం స్పందించింది. వినయ్ రెడ్డి, నరేందర్ బాబు, శరత్ వంశీ మరియు ఇతర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సమస్యను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కార్యాలయాన్ని సందర్శించి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిఈఈ) యాదయ్య గారితో సమావేశమై కాలనీకి సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో తరచూ జరుగుతున్న మురుగు నీటి పొంగిపొర్లే పరిస్థితి నివాసితులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. దీనివల్ల రోడ్లపై రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం కూడా ఉందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తమ విలువైన సమయాన్ని కేటాయించిన ఏసీఫ్ బృందానికి ఫీల్ గుడ్ హోమ్స్ కాలనీ నివాసితుడు హేమశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

## హోప్ అన్నదానం.. ఆగని సేవా ప్రవాహం

- 191 వారాలుగా చందానగర్‌లో కొనసాగుతున్న అన్నప్రసాద వితరణ
- అన్నార్తులకు ఆశాకిరణంగా నిలుస్తున్న ఫౌండేషన్



హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న ఛైర్మెన్ కొండ విజయ్ కుమార్

**శేరిలింగంపల్లి విశాల భారతి:** పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా హోప్ ఫౌండేషన్ చేపట్టిన అన్నదాన యజ్ఞం 191వ వారానికి చేరింది. ప్రతి శనివారం నిర్విరామంగా కొనసాగుతున్న ఈ సేవ ఎందరో అన్నార్తులకు ఆశాకిరణంగా మారింది. శనివారం చందానగర్‌లో జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో వందలాది మంది భోజనం చేశారు. ఎలాంటి విరామం లేకుండా 191 వారాలుగా సేవ చేయడం అభినందనీయమని స్థానికులు అన్నారు. ఆకలితో వచ్చిన వారి కడుపు నింపి, వారి ముఖాల్లో ఆనందం చూడటమే మా లక్ష్యం' అని హోప్ ఫౌండేషన్ ఛైర్మెన్ కొండ విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఆత్మహత్య

- ఆరో అంతస్తు నుంచి దూకి బీటెక్ విద్యార్థి బలవన్మరణం..?
- అనారోగ్యం, కుటుంబ సమస్యలే కారణమా..?
- ఖమ్మం జిల్లా విద్యార్థిగా గుర్తింపు



**సైబరాబాద్ విశాల భారతి :** గచ్చిబౌలిలోని ఐఐఐటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి శనివారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాస్టల్ భవనం ఆరో అంతస్తు నుంచి దూకి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఖమ్మం జిల్లాకు చెందిన అనిరుద్(20)గా పోలీసులు గుర్తించారు. అతడు బీటెక్ కంప్యూటర్ సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యం, కుటుంబ సమస్యలతో బాధపడుతున్నట్లు ప్రాథమికంగా తెలిసింది. శనివారం తెల్లవారుజామున తాను ఉంటున్న హాస్టల్ బిల్డింగ్ ఆరో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థి మృతితో తోటి విద్యార్థులు, సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు.

## యువత సమస్యల పరిష్కారానికి పోరాటమే లక్ష్యం

**డీవైఎఫ్ఐ మూడవ పట్టణ మహాసభను.. విజయవంతం చేయాలని పిలుపు**



**ఆలేరు, విశాల భారతి:** డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (DYFI) ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఆలేరు మున్సిపల్ పరిధిలో నిర్వహించనున్న మూడవ పట్టణ మహాసభకు సంబంధించిన కరపత్రాలను డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వడ్డెమాన్ విప్లవ్ కుమార్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు విస్మరించాయని, ఉద్యోగాల భర్తీ పేరుతో నిరుద్యోగ యువతను కాలయాపన చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను నట్టేట ముంచాయని, ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్యలతో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, యువత హక్కులు, సమస్యల పరిష్కారం కోసం డీవైఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న జరగనున్న ఆలేరు మూడవ పట్టణ మహాసభను యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# విద్య పేరుతో దోపిడీ సామ్రాజ్యం..!

- నిబంధనలను పాతరేసి పిల్లల భవిష్యత్తుతో చెలగాటం చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లు..!
- నిబంధనలు 'రైజ్' అవ్వవు..., ఫీజులు మాత్రం 'సన్' లా మండుతాయ్!
- చిన్నగూడూరు 'రైజింగ్ సన్ టాలెంట్ స్కూల్'లో ఇష్టారాజ్యం.
- రేకుల షెడ్లలోనే నర్సరీ నుండి 5వ తరగతి వరకు బోధన.
- ఆట స్థలం లేదు.. అర్హత గల ఉపాధ్యాయులు లేరు.
- పుస్తకాలు, ఫీజుల పేరిట తల్లిదండ్రుల జేబులకు చిల్లు.
- విద్యాహక్కు చట్టం పూర్తిగా ఉల్లంఘన.. పట్టించుకోని అధికారులు.
- విద్య పేరుతో వ్యాపారం.. పిల్లల భవిష్యత్తుతో చెలగాటం!
- నిబంధనలు గాలికొదిలి.. తల్లిదండ్రులపై ఫీజుల భారం!
- భద్రత లేని భవనాల్లో బోధన.. ప్రమాదం పొంచి ఉందా?
- విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమమే: పీడీఎస్‌యూ హెచ్చరిక.
- పాఠశాలా..? లేక ఫీజుల వసూళ్ల కేంద్రమా..?
- పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్



**మహబూబాబాద్, విశాల భారతి :**



మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలో విద్యా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా, కనీస సౌకర్యాలు లేని భవనాల్లో ప్రైవేట్ పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. చిన్నగూడూరు మండల కేంద్రంలోని "రైజింగ్ సన్ టాలెంట్ స్కూల్". నర్సరీ నుండి ఐదో తరగతి వరకు నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో విద్యాశాఖ నిబంధనలు ఎక్కడా కనిపించడం లేదు కానీ, ఫీజుల దోపిడీ మాత్రం యథేచ్ఛగా సాగుతోంది.

**రేకుల షెడ్లలో విద్యాబోధన.. వానొస్తే వలవలా!**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాథమిక పాఠశాలలకు పక్కా భవనాలు, గాలి, వెలుతురు వచ్చేలా విశాలమైన గదులు ఉండాలి. కానీ ఈ పాఠశాలలో ఇరుకైన రేకుల షెడ్లలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఎండకాలంలో ఉక్కపోత, వర్షా కాలంలో "వానొస్తే వలవలా.. గాలొస్తే గలగల" అన్న సామెతగా విద్యార్థులు భయం భయంగా గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేకులపై పడే వర్షం శబ్దానికి ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు పిల్లలకు వినబడడమే గగనంగా మారింది.

**నో ప్లే గ్రౌండ్.. నో క్వాలిఫైడ్ టీచర్స్.**

విద్యాహక్కు చట్టం (RTE2009) ప్రకారం ప్రతి పాఠశాలకు ఖచ్చితంగా ఆట స్థలం ఉండాలి. శారీరక ఎదుగుదలకు ఆటలు ఎంతో అవసరం. కానీ ఇక్కడ కనీసం నిలబడడానికి కూడా సరైన స్థలం లేదు. ఇక విద్యాబోధన విషయానికొస్తే, నిబంధనల ప్రకారం టెట్ అర్హత, డి.ఇడి లేదా బి.ఇడి చేసిన వారినే ఉపాధ్యాయులుగా నియమించాలి. కానీ ఇక్కడ తక్కువ జీతాలకే వస్తున్నారని ఎలాంటి కనీస అర్హతలు లేని అనర్హులతో విద్యాబోధన సాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారు.

**పుస్తకాలు, ఫీజుల పేరిట లూటీ..,**

విద్యా నియంత్రణ చట్టాల ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుపై ఉంచాలి. కానీ ఇక్కడ ఇష్టారాజ్యంగా వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. వీటికి తోడు ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ప్రాంగణంలోనే ప్రైవేట్ పబ్లిషర్ల పుస్తకాలు, యూనిఫారాలను విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారు. బయట మార్కెట్ కంటే రెట్టింపు ధరలకు పుస్తకాలను అమ్ముతూ తల్లిదండ్రుల జేబులకు చిల్లు పెడుతున్నారు.

**విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారు?**

మండల కేంద్రంలోనే ఇంతటి నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా, ఉన్నతాధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ యాజమాన్యాల మామూళ్ల మత్తులో అధికారులు జోగుతున్నారా? అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి, చిన్నగూడూరులోని రైజింగ్ సన్ టాలెంట్ స్కూల్‌పై విచారణ జరిపి, నిబంధనలు పాటించని యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి విషయంపై చిన్నగూడూరు మండల విద్యాశాఖ అధికారి రవి కుమార్ కు వివరణ కోసం ఫోన్ చేయగా స్పందించలేదు.

## నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూల్‌పై చర్యలు తీసుకోండి

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న చిన్నగూడూరులోని 'రైజింగ్ సన్ టాలెంట్ స్కూల్'పై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పి డి ఎస్ యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. సదరు పాఠశాల యాజమాన్యం కనీస సౌకర్యాలు లేని రేకుల షెడ్లలో క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ఎలాంటి అర్హతలు లేని ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయిస్తూ, మరోపక్క అమాయక తల్లిదండ్రుల నుండి ముక్కుపిండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలను తుంగలో తొక్కి, వ్యాపార ధోరణితో నడుపుతున్న ఇలాంటి విద్యాసంస్థలపై ఉన్నతాధికారులు నిఘా పెట్టాలని కోరారు. తక్షణమే ఈ స్కూల్‌పై విచారణ జరిపి, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, లేనిపక్షంలో పిడిఎస్యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ హెచ్చరించారు.



– పి డి ఎస్ యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్



## పోలీసులకు ఆర్థిక నిర్వహణపై అవగాహన సదస్సు

- స్మార్ట్ ఫైనాన్షియల్ ప్లానింగ్, పొదుపు, పెట్టుబడులపై సూచనలు
- సైబర్ మోసాల బారిన పడొద్దన్న నిపుణులు



**సైబరాబాద్ విశాల భారతి:** కూకట్‌పల్లిలో పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ఆర్థిక నిర్వహణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలానగర్ డీసీపీ రితీరాజ్ సూచన మేరకు కూకట్‌పల్లి సీఐ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీపీ నర్సింహారెడ్డి, ఆర్థిక నిపుణుడు శ్రీధర్ రావు పాల్గొన్నారు.పోలీసు సిబ్బందికి స్మార్ట్ ఫైనాన్షియల్ ప్లానింగ్, పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక మోసాల నివారణపై వారు అవగాహన కల్పించారు. జీతంలో కొంత భాగాన్ని తప్పనిసరిగా పొదుపు చేయాలని, అనవసర అప్పులు, అధిక వడ్డీలకు ఆశపడి మోసపోవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఓటీపీలు, బ్యాంకు వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని హెచ్చరించారు. డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే బ్యాంకు లేదా పోలీసులను సంప్రదించాలని తెలిపారు.ఈ సదస్సులో బాలానగర్ డివిజన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి దిశగా కాంగ్రెస్ అడుగులు

**ఇందిరమ్మ చీరలతో అక్కాచెల్లెమ్మలకు ఆదరణ**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం, గండిపేట్ మండలం, జిహెచ్ఎంసి 123వ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఆడపడుచు చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రతి అక్కాచెల్లెమ్మకు చీరలు అందేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృషి చేస్తున్నారు. ఇదే సందర్భంలో ఉన్నత అధికారులతో సమావేశమై, ప్రతి అర్హురాలికి చీరలు అందేలా చర్చలు జరిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఇంటి గడపకు చేరే విధంగా నాయకులు ముందుకు సాగుతున్నారు.

**ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ కాంగ్రెస్ నాయకులు:**

దప్పు నవీన్ (A బ్లాక్ అధ్యక్షులు), అంకం శ్రీనివాస్ (బీసీ సెల్), వెస్ట్రన్ కాలనీ సుధాకర్ , బోగల శ్రీనివాస్ , ఎస్. శంకర్ , చింతల సుదర్శన్ , లక్ష్మణ్ , వార్డ్ మెంబర్ శీను గారు, బాల కుమార్ యాదవ్ , కట్ట విష్ణు , తుకారం , జి. శివకుమార్ గారు తదితరులు పాల్గొన్నారు. 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని సేవలందిస్తున్న సీనియర్ నాయకుల సేవలు అభినందనీయం.

## ఎల్లమ్మబండ ఎస్‌సీటీపీలో డీసీ తనిఖీలు

- డ్రైనేజీ పనులు, పారిశుద్ధ్యంపై ఆరా
- వేగంగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశం



ఎల్లమ్మబండ ఎస్‌సీటీపీ వద్ద డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న డీసీ చాముండేశ్వరి, అధికారులు

**సైబరాబాద్ విశాల భారతి:** కూకట్‌పల్లి జోన్ ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలోని ఎల్లమ్మబండ ద్వితీయ సేకరణ, రవాణా కేంద్రం (ఎస్‌సీటీపీ) వద్ద శనివారం డీసీ చాముండేశ్వరి పారిశుద్ధ్య తనిఖీలు నిర్వహించారు. డీఈ (ఎస్‌డబ్ల్యూఎం), ఎస్ఆర్పీ, వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి కేంద్రం వద్ద జరుగుతున్న మురుగు కాల్వ పనులను, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఎస్‌సీటీపీ పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలని, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజూ పరిశుభ్రత పాటించాలని, వ్యర్థాల రవాణాలో జాప్యం చేయొద్దని ఆదేశించారు.

## ధరణి నగర్‌లో డీసీ వర్షా కాల ముందస్తు తనిఖీలు

- నాలా, నీటి నిల్వ పాయింట్లు, ఫ్లెక్సీల తొలగింపుపై ఆరా
- అంతర్గత రోడ్లలో స్వీపింగ్ పనులు వేగవంతం చేయాలని ఆదేశం



**సైబరాబాద్ విశాల భారతి:** వర్షాకాల ప్రణాళికలో భాగంగా శనివారం ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 డీసీ చాముండేశ్వరి ధరణి నగర్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. డీఈ, ఎస్ఆర్పీ, ఎస్ఎఫ్ఏతో కలిసి కాలనీలోని నాలాను పరిశీలించి, నీటి నిల్వ ఉండే ప్రాంతాల్లో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. నాలాలో అడ్డంకులు తొలగించాలని, సిల్ట్ ఎప్పటికప్పుడు తీసివేయాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా కాలనీలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న పనులను పర్యవేక్షించారు. అంతర్గత రోడ్లలో స్వీపింగ్ పనులు ముమ్మరంగా చేపట్టాలని, ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చూడాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహించవద్దని స్పష్టం చేశారు.

## దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి



**యాదాద్రి భువనగిరి, విశాల భారతి :** తొలి సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 81వ వర్ధంతి సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టరేట్ లో ఆయన చిత్రపటానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలని, ఆయన తెలంగాణ రైతాంగ పోరాటంలో చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని వెంకా రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, కుల సంఘ నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్ పత్రాల నమోదుపై బిఎల్వోలకు శిక్షణ

**ఐటీడీఏ పీవో రాహుల్**




**అశ్వాపురం, విశాల భారతి :** సర్ పత్రాలు నింపే అవగాహన లేని ఓటర్ల జాబితా ఫారాలను బిఎల్ఓలే పూర్తిచేయాలని ఐటీడీఏ పీవో, పినపాక నియోజకవర్గ ఈఆర్వో రాహుల్ అన్నారు. ఓటర్ల సమగ్ర సవరణలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన బీఎల్వోలు, సూపర్వైజర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని సర్ పత్రాలు అందజేత, పూర్తి చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాలు పూరించేటప్పుడు ఓటర్ల పూర్తి వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని, ఎటువంటి తప్పిదాలకు తావివ్వకుండా చూసుకోవాలన్నారు. 2002 ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలు, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ వంటి అవసరమైన పత్రాలను పరిశీలించి చేయాలన్నారు. ఒక్క ఓటు కూడా తప్పిపోకుండా బి ఎల్ వో లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఓటర్ జాబితా సవరణ అంశాన్ని వివరంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, తహసీల్దార్ సూర్యప్రకాశ్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ అనూష, బీఎల్వోలు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## బి ఎల్ ఓ లు తప్పులు లేకుండా నమోదు చేయాలి



**ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్**

**మణుగూరు, విశాల భారతి :**

భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా పారదర్శకత కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ సంబంధిత బి ఎల్ ఓ లు సూపర్వైజర్లు ఎనిమరేషన్ ఫారాలు ఓటర్లకు అందించి వివరాలు పొందుపరిచేటప్పుడు ఓటర్లకు సంబంధించిన సమాచారం సమగ్రంగా అడిగి తెలుసుకుని పూరించాలని పినపాక నియోజకవర్గం విఆర్ఓ మరియు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సంబంధిత బి ఎల్ ఓ సూపర్వైజర్లకు సూచించారు. శనివారం నాడు పినపాక నియోజకవర్గం లోని మణుగూరు మండలంలోని పోలింగ్ స్టేషన్ల బి ఎల్ ఓ మరియు సూపర్వైజర్లకు ఆ మండలాలలోని రైతు వేదికలో సమగ్ర సర్వే ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు పూరించేటప్పుడు తప్పనిసరిగా ఓటర్ల యొక్క 2002 సంవత్సరములో ఓటు ఉన్న వారి కోసం ఒక బాక్స్ 2002లోఓటు లేని వారి కోసం మరోబాక్సు ఉంటుందని ఈ రెండు అంశంలో ఒక దానిని మీరు పరిస్థితిని ఆధారంగా నిర్ణయించుకొని ఎన్యుమరేషన్ నింపాలని అన్నారు. కానీ ప్రజలకి ఆ ఫారాలు నింపటం అర్థం కాని పరిస్థితి ఉంది కాబట్టి ఓటర్లకు అవగాహన కల్పించి బి ఎల్ ఓ లు తప్పనిసరిగా పూర్తిస్థాయి వివరాలు తెలుసుకొని తప్పులు లేకుండా నమోదు చేయాలని అన్నారు. ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా చేర్పించాలని, ఒకవేళ ప్రస్తుతం నివాసం ఉన్న 2002 ఓటర్ జాబితాలో ఓటు లేకపోతే బంధువుల్లో ఉన్నవారి వివరాలను ఈ బాక్స్ లో నింపాలని, మూడో భాగంలో ఓటరు ప్రస్తుతం వివరాలతో నింపాలని, అభ్యర్థి యొక్క పుట్టిన తేదీ ఆధార్ కార్డు నెంబరు మొబైల్ నెంబరు సంరక్షడి పేరు సంరక్షడి ఓటరు గుర్తింపు కార్డు నెంబరు తల్లి పేరు తల్లి ఓటర్ గుర్తింపు కార్డు నెంబరు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు. ఓటర్లకు పెళ్లి అయితే వారి భాగస్వామ్యం పేరు ఆమె ఓటరు గుర్తింపు నెంబరు పొందుపరచాలని ,పెళ్లి అవ్వకపోతే ఖాళీగా వదిలేయాలని, భవిష్యత్తులో హోటల్ యొక్క ఓట్లు గల్లంత కాకుండా ఉండాలంటే ఓటర్లు సరైన పత్రాలు ఆధార్ కార్డు ,జనన ధ్రువీకరణ పత్రం, పాస్ కార్డు, పదో తరగతి, సర్టిఫికెట్, శాశ్వత నివాసం ధ్రువీకరణ పత్రం, అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం, ఎస్సీ ఎస్టీ ఓబీసీలకు ధ్రువీకరణ పత్రం, ఇంటి అద్దె రసీదు, లేదా కరెంటు బిల్లు, వంటి పత్రాలను సిద్ధంగా ఉంచుకోండి సరైన వివరాలు పిఎల్ఓ లకు అందించటం వల్ల భవిష్యత్తులో ఓటరు కార్డులో పేరు గల్లంతు కాకుండా ఉంటుందని అలాగే ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా చూడటం ద్వారా ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా మనం ఓటు హక్కు వినియోగించుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పి వి టి జి అధికారి గన్యా నాయక్, తాసిల్దార్ నరేష్ ఎలక్షన్ డి టి ఆర్ ఐ రామారావు, రమేష్ మరియు బిఎల్వోలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాత భాస్కర్ థియేటర్ ఎదుటే పబ్లిక్ అండర్‌పాస్ నిర్మించాలి

**అడ్వకేట్ చెరుకు శివకుమార్ గౌడ్ డిమాండ్**



**చౌటుప్పల్ విశాల భారతి:** పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ ప్రాజెక్టులో భాగంగా పాత భాస్కర్ థియేటర్ ఎదుట ప్రజల అవసరాలకు అనుగుణంగా పబ్లిక్ అండర్‌పాస్ నిర్మించాలని మునుగోడు నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి, అడ్వకేట్ చెరుకు శివకుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని మరియు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని రాంనగర్, కృష్ణానగర్, శాంతినగర్, కంచరకుంట్ల కాలనీ, గణేష్‌నగర్, విశ్వకర్మ కాలనీ, కౌండిన్యనగర్‌తో పాటు మొత్తం పది కాలనీలకు చెందిన వెయ్యికి పైగా కుటుంబాలు ఈ ప్రాంతం మీదుగానే నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. గతంలో ప్రజల సౌకర్యార్థం ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కూడా నిర్మించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పాత భాస్కర్ థియేటర్ ఎదుటే పబ్లిక్ అండర్‌పాస్ నిర్మిస్తే వేలాది మంది ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించవచ్చని అన్నారు. అలాగే ఈ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలు కూడా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఎక్కువగా వినియోగించే ప్రాంతాన్ని పక్కనపెట్టి వేరే చోట పబ్లిక్ అండర్‌పాస్ నిర్మించడం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల రాకపోకలు, స్థానిక అవసరాలు, భవిష్యత్ ట్రాఫిక్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పాత భాస్కర్ థియేటర్ ఎదుటే పబ్లిక్ అండర్‌పాస్ నిర్మించేలా వెంటనే నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను మరియు ప్రజాప్రతినిధులను అడ్వకేట్ చెరుకు శివకుమార్ గౌడ్ కోరారు.

# చక్కెరతో సారా.. గిరిజన ప్రాంతాల్లో విషం!

- మరిపెడ మండలంలో మళ్లీ నాటు సారా మాఫియా విజృంభణ?
- యువత భవిష్యత్తుతో చెలగాటం..
- చిన్న వయసులోనే వితంతువులవుతున్న మహిళలు..
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

**మరిపెడ విశాల భారతి:**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గిరిజన గ్రామాల్లో అక్రమ నాటు సారా తయారీ, విక్రయాలు మళ్లీ ఊపందుకున్నాయనే ఆరోపణలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. చక్కెరతో పాటు వివిధ రకాల రసాయనాలను కలిపి నాసిరకం నాటు సారాను తయారు చేసి గ్రామాల్లో బహిరంగంగా విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా తయారవుతున్న ఈ నాటు సారా గిరిజన కుటుంబాల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి, సామాజిక జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతోందని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరిపెడ మండల పరిధిలోని వెంకటయ్య తండా, మేఘ్యా తండా, బావోజిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని భూక్య తండా, చింతలగడ్డ తండా, పామండ తండా, ఎలమంచిలి తండా తదితర గిరిజన ప్రాంతాల్లో నాటు సారా బట్టీలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అడవి ప్రాంతాలను ఆశ్రయంగా చేసుకుని కొందరు అక్రమ వ్యాపారులు పెద్ద ఎత్తున నాటు సారాను తయారు చేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో రోజువారీ కూలి పనులకు వెళ్లే యువకులు సులభంగా ఈ మద్యం బారిన పడుతున్నారని, తక్కువ ధరకు లభిస్తుండటంతో నాటు సారా వ్యసనం వేగంగా పెరుగుతోందని గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు. దీని వల్ల యువత ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు ఉపాధి కోల్పోవడం, కుటుంబ కలహాలు, అప్పుల ఊబిలో చిక్కుకోవడం వంటి సమస్యలు అధికమవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, నాసిరకం నాటు సారాను అధికంగా సేవించడం వల్ల అనేక మంది యువకులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, కొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారని చెబుతున్నారు. ఈ పరిస్థితుల కారణంగా 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల మహిళలు చిన్న వయసులోనే భర్తలను కోల్పోయి వితంతువులుగా మారుతున్న విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటు సారా వ్యసనం అనేక చిన్నారులను తండ్రి ప్రేమకు దూరం చేస్తోందని, కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నాయని వారు పేర్కొంటున్నారు. గ్రామాల్లో బహిరంగంగానే నాటు సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలు అప్పుడప్పుడు దాడులు నిర్వహిస్తున్నప్పటికీ అక్రమ వ్యాపారం మాత్రం యథావిధిగా కొనసాగుతోందని వారు విమర్శిస్తున్నారు. అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుని, నాటు సారా బట్టీలను పూర్తిగా నిర్మూలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా గిరిజన గ్రామాల్లో మద్యం వ్యసన నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సామాజికవేత్తలు సూచిస్తున్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ అక్రమ దందా

- ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం.. ప్రభుత్వ ఖజానాకు లక్షల్లో గండి
- టూరిస్ట్ పర్మిట్లతో ప్యాసింజర్ రవాణా.. నిబంధనలకు తూట్లు
- అధిక లోడ్, అధిక వేగం.. ప్రమాదాలకు కారణమవుతున్న ప్రైవేట్ బస్సులు




**ఆదిలాబాద్ జిల్లా జూలై 04 విశాల భారతి న్యూస్:-**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్స్ పేరుతో అక్రమ ప్రయాణికుల రవాణా యథేచ్ఛగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రయాణికుల భద్రతను పూర్తిగా విస్మరించి, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ కొందరు ట్రావెల్స్ యాజమాన్యాలు కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. టూరిస్ట్ పర్మిట్లతో ప్యాసింజర్ సర్వీసులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి లక్షల రూపాయల నష్టం కలిగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు ప్రతిరోజూ 15 నుంచి 18 వరకు ప్రైవేట్ బస్సులు నడుస్తుండగా, జాతీయ రహదారి గుండా ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, రాయపూర్, నాగ్‌పూర్ ప్రాంతాల నుంచి వందలాది ప్రైవేట్ బస్సులు ప్రయాణికుల రవాణా చేస్తున్నట్లు సమాచారం. వీటిలో చాలా వరకు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

**టూరిస్ట్ పర్మిట్లతో ప్యాసింజర్ రవాణా..?**

ప్యాసింజర్ సర్వీసులకు ప్రత్యేక అనుమతులు, పన్నులు చెల్లించాల్సి ఉండగా, కొందరు టూరిస్ట్ పర్మిట్లతోనే సాధారణ ప్రయాణికులను ఎక్కించుకొని వాణిజ్య రవాణా నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన పన్ను ఆదాయం భారీగా తగ్గుతున్నట్లు తెలుస్తోంది.

**ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న బస్సులు**

ప్రయాణికుల భద్రతను పట్టించుకోకుండా కండిషన్ లేని బస్సులను రోడ్డెక్కించడం, అతివేగంగా నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో డ్రైవర్ల నిర్లక్ష్యం, అనుభవం లేకపోవడం కూడా ప్రమాదాలకు దారితీస్తోందని పేర్కొంటున్నారు.

**మహబూబ్ ఘాట్ ప్రమాదం మరువకముందే..**

గత ఏడాది నిర్మల్ జిల్లా మహబూబ్ ఘాట్ వద్ద జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, 22 మంది గాయపడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రమాదానికి గురైన బస్సు టూరిస్ట్ సర్వీసుగా నమోదై ఉండడం, డ్రైవర్‌కు తగిన అనుభవం, హెవీ లైసెన్స్ లేకపోవడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చినట్లు అప్పట్లో చర్చ జరిగింది.

**అధిక లోడ్.. అధిక వసూళ్లు**

42 మంది ప్రయాణికుల సామర్థ్యం ఉన్న బస్సుల్లో 50 మందికి పైగా ప్రయాణికులను ఎక్కించి టికెట్లు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డిమాండ్‌ను బట్టి టికెట్ ధరలను కూడా భారీగా పెంచి ప్రయాణికులను దోచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**జీఎస్టీ చెల్లించని సరుకు రవాణాపై అనుమానాలు**

కొన్ని ప్రైవేట్ బస్సుల్లో వెనుక డిక్కీల్లో జీఎస్టీ చెల్లించని సరుకులను అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆదిలాబాద్-హైదరాబాద్ మధ్య పెద్ద మొత్తంలో వస్తువులు తరలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**ఒక పర్మిట్... మూడు నాలుగు బస్సులా..?**

ఒక్క బస్సుకు మాత్రమే పర్మిట్ తీసుకొని అదే పేరుతో మూడు, నాలుగు బస్సులను తిప్పుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడమే కాకుండా అక్రమ రవాణా మరింత పెరుగుతోందని తెలుస్తోంది.

**పేరున్న ట్రావెల్స్ సేవలపైనా ప్రశ్నలు**

జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ముస్కాన్, సహారా, మెట్రో గెలాక్సీ, ఎంబీకే, డైమండ్, ఆరెంజ్, జీడీఆర్ తదితర ప్రైవేట్ ట్రావెల్స్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిలో కొన్ని సంస్థల కార్యకలాపాలపై కూడా పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖలు సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. (గమనిక: ఆరోపణలపై సంబంధిత సంస్థల స్పందన తెలుసుకొని ప్రచురించడం పాత్రికేయ నైతిక ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుంది.)

### అధికారుల తనిఖీలు ఎక్కడ..?



మోటార్ వెహికల్ శాఖ, రవాణా శాఖ, పోలీసు శాఖలు తరచూ తనిఖీలు నిర్వహిస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ట్రావెల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

– మది గణేష్ సీనియర్ జర్నలిస్ట్

## నీటి సమస్య పరిష్కారానికి చర్యలు వేగవంతం

**కమిషనర్‌కు కౌన్సిలర్ బీజనీ కళ్యాణి మధుకుమార్ వినతి**



**ఆలేరు, విశాలాభారతి:** ఆలేరు మున్సిపాలిటీ 4వ వార్డులో తాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని వార్డు కౌన్సిలర్ బీజనీ కళ్యాణి మధుకుమార్ మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ రెడ్డిని కోరారు. శివాలయం సమీపంలోని బోరింగ్‌ను పరిశీలించి, అందులో మోటార్ ఏర్పాటు చేసి శివాలయానికి వచ్చే భక్తులతో పాటు సమీప వీధిలోని నివాసితులకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా చింతల బస్తీ ప్రాంతంలోని మరో రెండు బోరింగ్‌లలో కూడా మోటార్లు ఏర్పాటు చేసి వార్డులో నీటి సమస్యలు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కమిషనర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ కె. శ్రీనివాస్ రెడ్డి సమస్యలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ బీజనీ కళ్యాణి మధుకుమార్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అమరుడు దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



**ఆలేరులో బీజేపీ నేతల పూలమాలలర్పణ**

**ఆలేరు, విశాల భారతి:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, నిజాం నిరంకుశ పాలనకు, దొరల దౌర్జన్యాలకు, వెట్టి చాకిరి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా శనివారం ఆలేరు పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఎగిడి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కారీ కృష్ణ, ఐదో వార్డు కౌన్సిలర్ పాశికంటి సంపత్, కౌన్సిల్ సభ్యుడు వడ్డమాని నరేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎలగల వెంకటేష్, బీజేవైఎం నాయకుడు కంతుల శంకర్, సీనియర్ నాయకులు తునికి దశరథ్, కళ్లెం రాజ్, మండల కార్యదర్శి బైరి మహేందర్, బూత్ అధ్యక్షుడు ఎగిడి సిద్ధులు, బందెల విష్ణు, పేరుపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అవసరమైతే దీనిని మరింత పత్రికా శైలిలో లేదా మరింత ప్రభావవంతమైన భాషలో కూడా సిద్ధం చేయగలను.

## యూరియా, విత్తనాల పంపిణీలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**మరిపెడ ఏడీ మురళిని కలసి అభినందించిన ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి**



**మరిపెడ విశాల భారతి:** మరిపెడ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా (ఏడీ) నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మురళిని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఖరీఫ్ సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు యూరియా, విత్తనాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా రైతులకు పంటల మార్పిడి విధానంపై విస్తృత అవగాహన కల్పించాలని, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం అందించే ఉద్యానవన పంటల సాగుపై ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సలహాలను రైతులకు చేరవేసి వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ అధికారులు పనిచేస్తూ, వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలని నల్లు సుధాకర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏడీ మురళి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## లక్ష్మీ డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్ ఘనంగా ప్రారంభోత్సవం

**శుభాకాంక్షలు తెలిపిన టీజేఏ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షానూర్**



**ఆలేరు, విశాల భారతి:** ఆలేరు పట్టణానికి చెందిన యువ వ్యాపారవేత్త మద్దూరు శ్రీకాంత్ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ డిజిటల్స్ ప్రింటింగ్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షానూర్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షానూర్ మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి రంగంలో అడుగుపెట్టి ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తే వ్యాపార సంస్థలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. లక్ష్మీ ప్రింటింగ్ సంస్థ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండి మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. నూతనంగా ప్రారంభమైన ఈ ప్రింటింగ్ షాప్ ద్వారా ఫ్లెక్సీలు, బ్యానర్లు, వివాహ పత్రికలు, విజిటింగ్ కార్డులు, డిజిటల్ ప్రింటింగ్ తదితర సేవలు అందుబాటులోకి రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు సర్పంచ్ జూకంటి అనిల్, జర్నలిస్ట్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి ఈఎల్వి సంస్థ చేయూత

**ఈఎల్వి సభ్యుడు మార్గం శివకృష్ణ సమాచారం మేరకు వెంటనే స్పందన**



**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని 14వ వార్డులో ఆర్థిక ఇబ్బందులతో ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న ఒక పదవ తరగతి విద్యార్థికి ఈఎల్వి ఫౌండేషన్ అండగా నిలిచి తన ఉదారతను చాటుకుంది.యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని సాంజాన్ విద్యానికేతన్ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన కానుగు అభిమన్యు అనే విద్యార్థి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాఠశాల ఫీజు బకాయిలను చెల్లించలేకపోయాడు.దీంతో సదరు పాఠశాల యాజమాన్యం విద్యార్థికి సంబంధించిన సర్టిఫికెట్లను ఇవ్వకుండా నిలిపివేసింది. ఈ విషయాన్ని గమనించిన ఈఎల్వి టీం సభ్యుడు మార్గం శివకృష్ణ యాదవ్, వెంటనే సమస్యను ఈఎల్వి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇరుగదిండ్ల భాస్కర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థి ఉన్నత చదువులకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ఇరుగదిండ్ల భాస్కర్ తక్షణమే స్పందించి,ఫౌండేషన్ తరపున రూ. 10,000 బకాయిలను సాంజాన్ విద్యానికేతన్ యాజమాన్యానికి చెల్లించి, విద్యార్థికి రావలసిన టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్లను ఇప్పించారు. విద్యార్థి భవిష్యత్తు పాడవకుండా సకాలంలో స్పందించి సాయం చేసిన ఈఎల్వి ఫౌండేషన్ నిర్వాహకులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నోముల సత్తిరెడ్డి, బండమీది కిరణ్, రాచకొండ మల్లేష్ పాటు ఈఎల్వి టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐ, ఏటీసీ కోర్సుల ప్రవేశాలకు గడువు పొడిగింపు

**యాదాద్రి భువనగిరి, విశాల భారతి:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణా సంస్థలు, అనుబంధ శిక్షణా కేంద్రాల్లో 202627 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును జూలై 10 వరకు పొడిగించినట్లు ఆలేరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని, ఆసక్తి గల విద్యార్థులు తమ విద్యా, కుల ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు.

## రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య




**విశాలభారతి, గూడూరు:** సందర్భంగా ఆ మహనీయుని కి పూలమాలవేసి నివాళులు అర్పించిన గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మలు నాయక్ వార్డు మెంబరు చీర బోయిన కుమార్ గూడూరు టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాసమల్ల యాకయ్య.కురుమ కమిటీ సభ్యులు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల రామచంద్ర. మండల సుధాకర్. మండల శ్రీను. కుండే కిషన్. కురుమ జిల్లా అధ్యక్షులు అశోక్. చీర బిక్షపతి. తదితరులు పాల్గొన్నారు

## పోస్టుల తాత్కాలిక మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ




**విశాలభారతి, గూడూరు:** గూడూర్ మండల పరిధిలోని ప్రీప్రైమరీ విభాగానికి మంజూరైన 5 పాఠశాలల లో ఇన్‌స్ట్రక్టర్లు మరియు ఆయా పోస్టుల నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితా మండల విద్యాశాఖ కార్యాలయం లో ప్రదర్శించబడినట్లు మండల విద్యాశాఖ అధికారి శ్రీ ఏ. సుజాత తెలిపారు.అభ్యర్థులు ప్రదర్శించబడిన తాత్కాలిక మెరిట్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు లేదా వివరాలలో వ్యత్యాసాలు ఉన్నట్లయితే, సంబంధిత ఆధార ధ్రువపత్రాలతో కలిసి 06072026 (సోమవారం) సాయంత్రం 5.00 గంటలలోపు మండల విద్యాశాఖ అధికారికి , గూడూర్ కు లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు. నిర్దేశించిన గడువు అనంతరం అందిన అభ్యంతరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబడవని, కావున సంబంధిత అభ్యర్థులు తప్పనిసరిగా గడువులోపు తమ అభ్యంతరాలను సమర్పించుకోవాలని కోరారు. అందిన అన్ని అభ్యంతరాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించిన అనంతరం తుది మెరిట్ జాబితా జిల్లా విద్యా శాఖధికారిచే విడుదల చేయబడుతుందని మండల విద్యాశాఖ అధికారి తెలిపారు

## ఎల్లంపేటలో గండి వీరభద్రం తండ్రిని పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్



**మరిపెడ విశాల భారతి:** మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామపంచాయతీ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గండి వీరభద్రం తండ్రి ప్రమాదవశాత్తు కాళ్లకు గాయపడిన విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ శనివారం వారి నివాసానికి స్వయంగా వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా గండి వీరభద్రం తండ్రి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గాయానికి అందుతున్న వైద్యం గురించి వివరాలు తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఎలాంటి అవసరం వచ్చినా తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా ఓటరు సర్వే పూర్తి చేయాలి

- బీఎల్ఓ యాప్ డిజిటలీకరణ పనులు వేగవంతం చేయాలని ఏఈఆర్వో ఆదేశం
- సమతానగర్‌లో ఫారాల నమోదును పరిశీలించిన డీసీ

**సైబరాబాద్ విశాల భారతి:** ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, డిజిటలీకరణలో భాగంగా శనివారం సమతానగర్ కాలనీలోని పోలింగ్ స్టేషన్ 476 పరిధిలో ఏఈఆర్వో, డీసీ ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 చాముండేశ్వరి బీఎల్ఓ యాప్‌లో నమోదు చేస్తున్న ఫారాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీఎల్ఓలు, సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి నింపిన ఫారం 6, 7, 8 వివరాలను తనిఖీ చేశారు. ఓటరు పేరు, చిరునామా, ఫోటో, ఇతర వివరాలు సరిగ్గా నమోదు అయ్యాయో లేదో బీఎల్ఓ యాప్‌లో క్రాస్ చెక్ చేశారు. తప్పులు లేకుండా 100 శాతం పారదర్శకంగా నమోదు చేయాలని, నిర్ణీత గడువులోగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఎవరైనా ఓటరు అర్హత ఉండి జాబితాలో పేరు లేకపోతే వెంటనే ఫారం 6 ద్వారా నమోదు చేయాలని, మరణించిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లను ఫారం 7 ద్వారా తొలగించాలని ఆదేశించారు.

## అరుణోదయ నాగన్నకు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్న నివాళి

- ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి తీరని లోటు
- విప్లవ గాయకుడి గళం తరతరాలకు స్ఫూర్తి
- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోకన్న
- గోదావరి లోయ విప్లవ గానానికి మూగబోయిన కంచు కంఠం
- ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి నాగన్న సేవలు చిరస్మరణీయం
- ప్రజల బాధలను పాటల్లో పలికించిన మహోన్నత గాయకుడు
- నాగన్న ఆలపించిన విప్లవ గీతాలు తరతరాలకు స్ఫూర్తి
- చివరి శ్వాస వరకు ప్రజా ఉద్యమానికే అంకితమైన జీవితం
- అమరుల త్యాగాలను గాన రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లిన కళాకారుడు
- నాగన్న మరణం ప్రజా ఉద్యమానికి పూడ్చలేని లోటు
- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్

**మహబూబాబాద్ విశాల భారతి:**



గోదావరి లోయలో సాగిన విప్లవోద్యమానికి, తెలంగాణ ప్రజా ఉద్యమానికి తన కంచు కంఠంతో ఊపిరి పోసిన ప్రముఖ విప్లవ గాయకుడు అరుణోదయ కామ్రేడ్ నాగన్న (పరకాల నాగన్న) మరణం ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్న అన్నారు. నాగన్న అంతిమయాత్రలో పాల్గొని ఆయనకు నివాళులర్పించిన అనంతరం అశోకన్న మాట్లాడుతూ, ప్రజా ఉద్యమాలకు నాగన్న అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామానికి చెందిన పరకాల లక్ష్మమ్మ, పాపయ్య దంపతుల కుమారుడైన నాగన్న 1978లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉద్యమంలో పూర్తికాల కార్యకర్తగా చేరారని తెలిపారు. తన సహచరి లక్ష్మితో కలిసి అడవులు, పల్లెలు తిరుగుతూ ప్రజల సమస్యలు, ఉద్యమాలు, అమరుల త్యాగాలను పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లారని చెప్పారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో ప్రముఖ కళాకారుడిగా ఎన్నో దశాబ్దాల పాటు విశిష్ట సేవలందించారని కొనియాడారు. నాగన్న గళం కేవలం గానం మాత్రమే కాదని, అది ప్రజల బాధలకు స్వరంగా, పోరాటాలకు ప్రేరణగా నిలిచిందని అశోకన్న పేర్కొన్నారు. ఎమర్జెన్సీ కాలంలో అమరుడైన రామనర్సయ్యపై ఆలపించిన "అన్నా అమరుడురా.. మన రామనర్సయ్య", పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జంపాల చంద్రశేఖర్ ప్రసాద్‌పై పాడిన "ఉయ్యాలో జంపాలో", అలాగే అరుణోదయ రామారావు, అమరుడు లింగన్న తదితరులపై ఆలపించిన విప్లవ గీతాలు నేటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయని తెలిపారు. ఈ పాటలు యూట్యూబ్‌లో లక్షలాది మంది వీక్షకులను ఆకట్టుకున్నాయని గుర్తుచేశారు. ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన నాగన్న సేవలను గుర్తిస్తూ 2024 అక్టోబర్‌లో ప్రతిష్ఠాత్మక సుద్దాల హనుమంతు జాతీయ పురస్కారం ఆయనకు ప్రదానం చేయడం ఆయన ప్రజా జీవితానికి దక్కిన గొప్ప గౌరవమని అశోకన్న అన్నారు. ప్రజల జీవిత గాథలు, అణగారిన వర్గాల కష్టాలు, సామాజిక అన్యాయాలను తన గళంలో ప్రతిధ్వనింపజేస్తూ చివరి వరకు ప్రజా సాంస్కృతిక ఉద్యమానికే అంకితమైన మహోన్నత వ్యక్తిగా నాగన్న చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. అరుణోదయ కామ్రేడ్ నాగన్న మరణం ప్రజా సాంస్కృతిక రంగానికి తీరని లోటని, ఆయన ఆలపించిన విప్లవ గీతాలు, ప్రజల పట్ల నిబద్ధత, పోరాట స్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అశోకన్న అన్నారు. అరుణోదయ నాగన్న అంతిమయాత్రలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు గుగులోత్ గణేష్, దంతాల నారాయణ, సుంకరి బుజ్జయ్య, భాగ్యమ్మ లు పాల్గొని నాగన్నకు ఘనంగా నివాళులర్పించారు.

## నేల రాలిన ప్రజల గొంతుక, విప్లవ పాట అరుణోదయ నాగన్నకు విప్లవ జోహార్లు!

**టీ యూ సి ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్!**



**పాల్వంచ విశాల భారతీ:** శనివారం ఖమ్మంలోని లెనిన్ నగర్ లో పార్టీ ఆఫీస్ వద్ద అనారోగ్యంతో మరణించిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు కా: అరుణోదయ నాగన్న భౌతిక కాయాన్ని సందర్శించి గణంగా నివాళులు అర్పించిన భద్రాది కొత్తగూడెం టి యూ సి ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరుణోదయ నాగన్న మృతి విప్లవోధ్యమానికి. కార్మిక వర్గ పోరాటాలకు తీరని లోటు అని, నాగన్న మృతికి.టి యు సి ఐ పాల్వంచ ఏరియా కమిటీ నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగడ సానుభూతిని తెలియచేసారు అరుణోదయ నాగన్న గత ఐదు దశాబ్దాలుగా అరుణోదయ కళాకారునిగా విప్లవ గీతాలు ఆలపిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడం, గోదావరి లోయ పోరాటాల గానాన్ని ఆలపించడం అరుణోదయ నాగన్నగా పేరు పొందడం ఉభయ తెలుగు రాష్ట్రాల వామపక్ష ఉద్యమాలకు విప్లవ గీతాలను ఆలపిస్తూ ప్రాముఖ్యతను పొందిన నాగన్న అకాల మరణం విప్లవ అభిమానులను పౌర, ప్రజాస్వామిక హక్కుల కార్యకర్తల విద్యార్థి, మహిళ, కార్మిక ,కర్షక వర్గాలకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమం లో సి పి ఐ (ఎం ఎల్) మాస్ లైన్ పార్టీ పాల్వంచ నాయకులు రాయబారావు వెంకటేశ్వర్లు, వేల్పుల రమేష్, కుంజా భాస్కర్ తదితరులు నివాళులు అర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

# జూద స్థావరంపై చీతా ఫోర్స్ మెరుపు దాడి

**పదిమంది జూదరులు అరెస్ట్**



**ఆర్మూర్ ,విశాల భారతి:** నందిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నుత్ పల్లి గ్రామ సమీపంలో ఒక గెస్ట్ హౌస్ పై విశ్వాసనీయ సమాచారం తో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి .సాయి చైతన్య ఆదేశాల మేరకు ఏసిపి మస్తాన్ అలీ ఆధ్వర్యంలో శనివారం చీ తా ఫోర్స్ దాడి నిర్వహించారు. ఈ దాడిలో గెస్ట్ హౌస్ లో పేకాట ఆడుతున్న పదిమంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.58,490 నగదు పది సెల్ ఫోన్లు, ఐదు మోటర్ సైకిల్ లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలకు కొరకు నందిపేట్ పోలీస్ స్టేషన్ ఎస్సై వినయ్ కి అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూదం, గుట్కా, మత్తు పదార్థాల విక్రయాలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్ కు లేదా పోలీస్ శాఖకు సమాచారం అందజేయాలని కోరారు సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు.

# మాజీ మంత్రి ఎర్రబెల్లి

**దయాకర్ రావు జన్మదిన వేడుకలు**



**దేవరుప్పుల విశాల భారతి:** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు 70వ జన్మదినం సందర్భంగా దేవరుప్పుల మండల కేంద్రంలోని జనగామ సూర్యాపేట రహదారి చౌరస్తా ప్రాంగణంలో దేవరుప్పుల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ శ్రేణులు నిర్వహించగా ముఖ్య అతిధిగా ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,ఎర్రబెల్లి దయాకర్ రావు సతీమణి ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు పాల్గొని కేకును కోసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని బిఆర్ఎస్ కార్యకర్తలకు, ప్రయాణికులకు, ప్రజలకు భోజనాన్ని స్వయంగా వడ్డించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్,మండల ప్రధాన కార్యదర్శి చింత రవి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధారావత్ రాంసింగ్ నాయక్,సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్,మాజీ ఎంపిపి కొల్లూరి సోమన్న, జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు,గ్రామ శాఖ అధ్యక్షులు,మండల,గ్రామ నాయకులు,యువజన నాయకులు,కార్యకర్తలు,అభిమానులు,పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్యకు నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



**దేవరుప్పుల విశాలభారతి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరగడీలకు వ్యతిరేకంగా పోరాడి తొలి అమరుడిగా చరిత్రలో నిలిచిన దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు దేవరుప్పుల మండలం,కడవెండి గ్రామంలోని దొడ్డి కొమురయ్య స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించిన దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావేర అనిల్ కుమార్ యాదవ్. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ హక్కుల కోసం తన ప్రాణాలను అర్పించిన దొడ్డి కొమురయ్య ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమైన మహనీయుడని,వారి త్యాగం,పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల ఎస్సీ,బిసి,ఎస్టీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు,కాడబోయిన గణేష్, భూక్య సజ్జన్ నాయక్,జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పుల సురేష్ బాబు,జిల్లా కార్యదర్శులు పాండు కృష్ణ,భాస్కర్ నాయక్,నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్,ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్,మండల నాయకులు,గ్రామ సర్పంచులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్థివ దేహానికి నివాళులర్పించిన దావేర అనిల్



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం,కడవెండి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాడబోయిన విక్రమ్ తల్లి కాడబోయిన సోమలక్ష్మి అనారోగ్యంతో మరణించగా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు దేవరుప్పుల మండల పార్టీ అధ్యక్షుడు దావేర అనిల్ కుమార్ యాదవ్ వారి నివాసానికి వెళ్లి సోమలక్ష్మి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాడబోయిన విక్రమ్ ను,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భగవంతుడు సోమలక్ష్మి ఆత్మకు శాంతి చేకూర్చాలని,వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,జిల్లా నాయకులు,వివిధ గ్రామాల సర్పంచులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తుల చేసుకోండి

**సిడిపిఓ కే.యం తార**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :** బూర్గంపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఓ కే.కే తార కోరారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బూర్గంపాడు మండలంలోని మోతేపట్టి నగర్, సింగారం, జిన్నగట్టు, అంజనాపురం 01, 03 ఇరవెండి పై కొత్తూరు, మహేందర్ నగర్, ఎంపీ బంజర 03 ఎస్సీకి కేటాయించగా, తాళ్ల గొమ్మూరు 02 రెండవ సెంటర్తో కలిపి మొత్తం 08 పోస్టులు ఎస్టీలకు రిజర్వ్ చేసినట్లు ఆమె తెలిపారు. అశ్వాపురం మండలంలోని పాత చింతిర్యాల టీచర్ పోస్టులను ఓసికి కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల మూడో తేదీ నుండి దరఖాస్తులు ఆన్లైన్ ప్రారంభమైందని, కేటాయించిన అభ్యర్థులు 18. 07 2026 సాయంత్రం 5 దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ పాస్ లేదా 10 ప్లస్ టు లో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. 01. 07. 26 నాటికి 18 సంవత్సరాల వయసు నిండి 35 సంవత్సరాల లోపు వారు అర్హులు అన్నారు. అదేవిధంగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా స్థానిక మహిళ అయి ఉండాలని ఆమె తెలిపారు.

# సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

**కాంగ్రెస్ నాయకురాలు, 7వ డివిజన్ ఇంచార్జి చల్లగుండ్ల సుజాత**



**పాల్వంచ:విశాలభారతి :** ఓటరు హక్కు పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రస్తుతం కొనసాగుతున్న సర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియలో ప్రజలు తప్పనిసరిగా భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నాయకురాలు, 7వ డివిజన్ ఇంచార్జి చల్లగుండ్ల సుజాత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితాలో తమ వివరాలను ప్రతి కుటుంబం తప్పనిసరిగా సరి చూసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతదేశ పౌరుడిగా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఆ హక్కును కాపాడుకోవడంలో సర్ ప్రక్రియ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం చేస్తే ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగిపోయే ప్రమాదం ఉండటమే కాకుండా, భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, గుర్తింపు కార్డులు తదితర అంశాల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని హెచ్చరించారు.ఒకవేళ బిఎల్ఓ. ఇంటికి రాకపోయినా లేదా ఆలస్యం జరిగినా ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా, తమ పరిధిలోని బి ఎల్ ఓ ను స్వయంగా సంప్రదించి ఎన్యుమరేషన్ ఫారమ్ తీసుకోవాలని కోరారు. ఆ ఫారమ్లోని పేరు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు, ఇతర సమాచారం అన్నింటినీ జాగ్రత్తగా సరిచూసుకుని, ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేసి సకాలంలో అధికారులకు సమర్పించాలని సూచించారు

# గిరిజన తండాల్లో, గూడాల్లో 'విష సారాయి ' రాజ్యం...

# పాలన ఎక్కడ?

- అడవుల్లో సారాయి బట్టీలు...
- గ్రామాల్లో మరణ ఘంటికలు!
- చక్కెరతో సారాయి ... గిరిజన ప్రాణాలతో చెలగాటం!
- మరిపెడలో నాటు సారాయి మాఫియా విజృంభణ...
- అధికార యంత్రాంగం మౌనమేనా?
- గిరిజన ప్రాంతాల్లో విష సారాయి విలయం...
- కళ్లుమూసుకున్న అధికారులా?
- సారాయి మాఫియా దందా జోరు...
- గిరిజన కుటుంబాల జీవితాలు బూడిద!
- యువతను మింగేస్తున్న విష సారాయి... నిద్రపోతున్న వ్యవస్థ!
- నాటు సారాయి మాఫియాకు అడ్డుకట్ట ఎప్పుడు?... గిరిజన తండాల్లో, గూడాల్లో గుబులు!
- అడవుల్లో సారాయి బట్టీలు... గిరిజన గూడాల్లో విష సంస్కృతి!

**మహబూబాబాద్ విశాల భారతి:**





మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని వెంకటయ్య తండా, మేఘ్యు తండా, భూక్య తండా, చింతలగడ్డ తండా, పామంద తండా, ఎలమంచిలి తండా తదితర గిరిజన గ్రామాల సమీప అటవీ ప్రాంతాల్లో నాటు సారా బట్టీలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చక్కెరతో పాటు ప్రమాదకర రసాయనాలు కలిపి నాసిరకం మద్యాన్ని తయారు చేసి గ్రామాలకు తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అడవులను అడ్డాగా చేసుకుని ఈ అక్రమ వ్యాపారం బహిరంగంగానే సాగుతున్నా సంబంధిత శాఖలు సమర్థవంతంగా అడ్డుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక బట్టీని ధ్వంసం చేసినా మరుసటి రోజే మరోచోట కొత్త బట్టీ ఏర్పాటవుతోందని వారు అంటున్నారు. గిరిజన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్న ఈ అక్రమ మద్యం వ్యాపారం రోజురోజుకూ విస్తరిస్తుండగా, బాధ్యులపై కఠిన చర్యలు లేకపోవడంపై ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు. అడవుల్లో ఇంత పెద్ద ఎత్తున కార్యకలాపాలు సాగుతున్నా అధికారులకు తెలియదా? తెలిసి కూడా చర్యలు తీసుకోవడం లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**యువతను మింగేస్తున్న నాటు సారా... కూలిపోతున్న కుటుంబాలు!**

తక్కువ ధరకు సులభంగా లభిస్తున్న నాటు సారా మరిపెడ మండలంలోని గిరిజన యువతను వ్యసన బారిన పడేస్తోందని గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలి సంపాదనలో అధిక భాగం మద్యానికే ఖర్చవుతుండటంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. వ్యసనం కారణంగా అనారోగ్యం, పని సామర్థ్యం తగ్గిపోవడం, అప్పులు పెరగడం, కుటుంబ కలహాలు తీవ్రమవడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారుల చదువులు దెబ్బతింటుండగా, మహిళలు కుటుంబాలను ఒంటరిగా నెట్టుకొస్తున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గ్రామాల్లో నాటు సారా బహిరంగంగా విక్రయమవుతున్నా నియంత్రణ చర్యలు కనిపించకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీసులు, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టి యువత భవిష్యత్తును కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**చిన్న వయసులోనే వితంతువులవుతున్న మహిళలు... కన్నీటి గాథలు!**

నాసిరకం నాటు సారా సేవించి ఆరోగ్యాన్ని కోల్పోతున్న యువకుల సంఖ్య పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోవడంతో 25 నుంచి 30 సంవత్సరాల వయస్సులోనే మహిళలు భర్తలను కోల్పోయి వితంతువులుగా మారుతున్న విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలు తండ్రి ప్రేమకు దూరమవుతుండగా, కుటుంబాలు ఆధారాన్ని కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మహిళలు కూలి పనులు చేస్తూ కుటుంబాలను పోషించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. నాటు సారా వ్యసనం ఒక కుటుంబాన్నే కాదు, తరతరాల భవిష్యత్తును నాశనం చేస్తోందని సామాజికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగకుండా వెంటనే అక్రమ మద్యం తయారీ కేంద్రాలను పూర్తిగా నిర్మూలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**దాడులు చేస్తున్నామంటున్న అధికారులు... ఆగని అక్రమ వ్యాపారం!**

పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అప్పుడప్పుడు దాడులు నిర్వహిస్తున్నామని చెబుతున్నప్పటికీ మరిపెడ మండలంలోని గిరిజన ప్రాంతాల్లో నాటు సారా వ్యాపారం మాత్రం యథావిధిగా కొనసాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు కేసులు నమోదు చేస్తున్నామని అధికారిక ప్రకటనలు వస్తుండగా, మరోవైపు గ్రామాల్లో బహిరంగంగా సారా విక్రయాలు సాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో దాడులు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయా? లేక అసలు సూత్రధారులపై చర్యలు తీసుకోవడం లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయడంలో విఫలమైన శాఖలు బాధ్యత వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కూడా విచారణ జరిపి బాధ్యత నిర్ణయించాలని స్థానికులు కోరుతున్నారు.

**గిరిజన ప్రాణాలను కాపాడేది ఎవరు?... ప్రజల ప్రశ్నకు సమాధానం ఎప్పుడు!**

గిరిజన గ్రామాల్లో నాటు సారా వ్యసనం సామాజిక విపత్తుగా మారుతున్నా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ బట్టీలను పూర్తిగా నిర్మూలించడం, మద్యం వ్యసన నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వ్యసన బాధితులకు పునరావాసం కల్పించడం వంటి చర్యలను ప్రభుత్వం అత్యవసరంగా చేపట్టాలని కోరుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో చట్టం అమలవుతుందా లేదా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అంటున్నారు. ప్రాణాలను బలితీసుకుంటున్న ఈ అక్రమ వ్యాపారాన్ని అరికట్టకపోతే మరిన్ని కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకుని గిరిజన ప్రాంతాలను నాటు సారా రహిత ప్రాంతాలుగా మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నిజాం దొరల ఆగడాలను ఎదిరించిన ధీరుడు కొమురయ్య



**మోకు కనకా రెడ్డి**

**దేవరుప్పుల విశాల భారతి**

తెలంగాణ ప్రాంతంలో నైజాం రజాకార్లు జాగిందర్లు భూస్వాములు చేస్తున్న దోపిడి పీడనపై కమ్యూనిస్టు నాయకత్వంలో నిజాం దొరల నియంతృత్వ ఆగడాలను ఎదిరించిన ధీరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం దేవరుప్పుల మండలం,కడవెండి గ్రామంలో దొడ్డి కొమురయ్య ఎనిమిదవ వర్ధంతిని పురస్కరించుకొని సిపిఎం ఆధ్వర్యంలో వారి స్థూపానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు సిపిఎం మండల కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా కనకా రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించిన ఫలితంగా తెలంగాణ ప్రాంతంలో పేదలకు భూములు పంచడమే కాకుండా స్వేచ్ఛ స్వతంత్రం రావడం జరిగిందని,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని,కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులను భూములను గుంజుకునేందుకు ప్రయత్నం చేస్తుందని,ప్రాజెక్టుల పేరుతో అదా నీ అంబానీలకు కట్టపెట్టేందుకు ప్రయత్నం చేస్తుందని, ప్రజలు వారి ప్రయత్నాన్ని తిప్పి కొట్టాలని,రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని,నిలువ నీడలేని ప్రజలు గుడిసెలు వేసుకొని నివసిస్తుంటే సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం వాళ్ల గూడును కూల్ చేసి దుర్మార్గ పద్ధతి ఒడిగాడుతోందని,గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు అర్హులై వారందరికీ ఇవ్వాలని, పెన్షన్స్ నిరుద్యోగ భృతి జిల్లాలో పెండింగ్లో ఉన్న రిజర్వాయర్ పనులు వెంటనే పూర్తి పూర్తి చేసి రైతాంగానికి సాగు త్రాగునీరు అందించాలని, జిల్లాలో రైతులు కూలీలు కార్మికులు కర్షకులు, విద్యార్థులు యువజనులు వృత్తిదారులు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం చేసే పోరాటంలో కొమురయ్య స్ఫూర్తితో ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్, సాంబరాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్,సుంచు విజేందర్, మండల్ నాయకులు పయ్యావుల బిక్షపతి, ఐలాపురం నరసమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాస గానిసుమ, గద్దం యాదగిరి, చింత మైసయ్య, పి రవి, పి కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యకు గౌరవ డాక్టరేట్

**భద్రాద్రి కొత్తగూడెం కరకాగూడెం చిరుమల్ల గ్రామం**



**విశాల భారతి :** ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, ఆదివాసీ హక్కుల ఉద్యమ నాయకుడు చందా లింగయ్యకు గౌరవ డాక్టరేట్ లభించింది.సామాజిక సేవ, నాయకత్వ రంగాల్లో అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్షిప్ అండ్ ఎక్సలెన్స్ చందా లింగయ్యకు గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఈ అంతర్జాతీయ గుర్తింపు పట్ల ఆయన అభిమానులు, అనుచరులు, పలువురు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

# వివాహ మహోత్సవంలో పాల్గొన్న సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్



**విశాల భారతి న్యూస్.** కరకాగూడెం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం మండలం, తాటిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని తాటిగూడెం గ్రామానికి చెందిన పూనెం వెంకటనర్సయ్య - తిరుపతమ్మ దంపతుల కుమారుడు ఓంకార్ - సావిత్రిల వివాహ మహోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ఈ సందర్భంగా వారు నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాభివృద్ధులతో నిండి ఉండాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు, వెంకటాపురం సర్పంచ్ చౌలం కేశవరావు పద్మాపురం సర్పంచ్ తోలెం రమేష్, చిరుమల్ల సర్పంచ్ కొమరం సుగుణ , రేగళ్ల సర్పంచ్ బాడిష పార్వతి , తాటిగూడెం ఉప సర్పంచ్ గాంధర్ల రామనాథం , మాజీ ఉప సర్పంచ్లు కొమరం వెంకటేశ్వర్లు , బాడిష లక్ష్మీనారాయణ , మండల నాయకులు దుర్గం కన్నయ్య , పోలేబోయిన పాపారావు , యువకులు దామోదర్ , సందీప్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి
- మండల పరిధిలో రూ.1.58 కోట్లతో 17 అభివృద్ధి పనులకు శ్రీకారం
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

**పాల్వంచ విశాల భారతి:**



ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని వివిధ పథకాలు, గ్రాంట్ల రూపంలో విడుదలైన రూ. 1.58 కోట్లతో నిధులతో చేపట్టనున్న 17 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని సిసి రోడ్లు, డ్రైన్లు, బిటి రెన్యూవల్స్, ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ప్రాధాన్యతా క్రమంలోనే పనులను చేపడుతూ నిధులను ఖర్చు చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తాను పూర్తి స్థాయిలో కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా నిలిపేందుకు ప్రతి చిన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాట్లు, మరింత అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నానని తెలిపారు. రహదారుల సౌకర్యం మెరుగు పడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని, ప్రతి గ్రామం, పంచాయతి కేంద్రాలలో హెల్త్ సెంటర్లు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామపంచాయతి కార్యాలయాలు, కమ్యూనిస్టుయి హాళ్లు, ప్రభుత్వ సేవాకేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా వారి సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికోసం అహర్నిశలు శ్రమిస్తున్నానని, అభివృద్ధి నిధులు రాబట్టేందుకు ఏ అవకాశం వచ్చినా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం జరుగుతోందన్నారు. శంకుస్థాపనలు జరిగిన పనులు నాణ్యతా ప్రమాణాలతో పదికాలాలపాటు ప్రజలకు ఉపయోగపడేలా నిర్మాణాలు జరగాలని, అందుకు అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని, పనులను నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలుసైతం పనులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్ సీపీఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, వీసం శెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, కొండా వెంకన్న, సీపీఐ నాయకులు కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, గుండాల నాగరాజు, నిమ్మల రాంబాబు మన్నెం వెంకన్న జకరయ్య, గిరి, యా ద్రాతి రవి, కోరేం శేఖర్, కొంగర అప్పారావు Sk.ఖాసీం, గుగులోత్ రాములు, బాబురావు, వజ్జా నాగరాజు, కోటి తిరుపతయ్య, ఇరుకులపాటి సుధాకర్, భరత్, భూక్య రమేష్, బద్రు, రామారావు, జక్కుల సురేష్, సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



## వెంకటేష్‌అనిల్ రావిపూడి సినిమా రీమేక్ కాదు

### వదంతులకు చెక్ పెట్టిన కీర్తి సురేష్!

విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్‌రామ్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ మల్టీస్టారర్ చిత్రంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వదంతులకు స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమా మరేదో చిత్రానికి రీమేక్ అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆమె పూర్తిగా ఖండించారు. వెంకటేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ భారీ మల్టీస్టారర్ చిత్రంలో కీర్తి సురేష్, కృతి శెట్టి నాయికలుగా నటిస్తున్నారు. అయితే, ఈ చిత్రం 2024లో మలయాళంలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన "గురువాయూర్ అంబలనాదయిల్" సినిమాకు రీమేక్ అని, అందువల్లే ఇందులో ఇద్దరు హీరోలు నటిస్తున్నారంటూ నెట్టింట పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. తాజాగా ఈ విషయంపై సోషల్ మీడియా వేదికగా ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు కీర్తి సురేష్ నేరుగా స్పందించారు. "కాదు, ఇది రీమేక్ చిత్రం కాదు" అంటూ ఆమె స్పష్టమైన సమాధానం ఇచ్చారు. ఈ ఒకే ఒక్క ప్రకటనతో సినిమాపై వస్తున్న ఊహాగానాలకు పూర్తిగా తెరపడింది. చిత్ర బృందం కథకు సంబంధించిన వివరాలను ప్రస్తుతానికి అత్యంత గోప్యంగా ఉంచినప్పటికీ, ఇది అనిల్ రావిపూడి మార్కుతో కూడిన ఒక సరికొత్త ఒరిజినల్ స్క్రిప్ట్ అని కీర్తి సురేష్ స్పష్టం చేయడంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.